### ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ పై

# ప్రధాని మోదీ ఏమన్నారంటే...!

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన భీకర ఎదురుకాల్పుల ఘటనలో 27 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. భద్రతా బలగాలు సాహసోపేతంగా వ్యవహరించాయంటూ కొనియాడారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (70) కూడా మరణించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఇది నక్సలిజం నిర్మూలనలో ఒక మైలురాయి వంటి విజయమని ఆయన అభివర్ణించారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని అమిత్ షా తన పోస్టులో పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన పోస్టును ప్రధాని నరేంద్ర మోదీ రీపోస్ట్ చేస్తూ భద్రతా బలగాలను ప్రశంసించారు. "మీ అద్భుత విజయాన్ని చూసి గర్వపడుతున్నాం. మావోయిజం ముప్పును పూర్తిగా తొలగించి, ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ప్రధాని తన సందేశంలో తెలిపారు. మాడ్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సమావేశమయ్యారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ కూంబింగ్‌లో బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలు పాల్గొన్నాయి. ఇటీవలే ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రె గుట్ట పర్వత ప్రాంతాల్లో 24 రోజుల పాటు సాగిన సుదీర్ఘ ఆపరేషన్‌లో 16 మంది మహిళా మావోయిస్టులతో సహా మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. తాజా ఘటనతో మావోయిస్టుల ఏరివేత చర్యలు మరింత ముమ్మరమయ్యాయని స్పష్టమవుతోంది.

# కాళేశ్వరం నోటీసులు

## కేసీఆర్ బండారం బయటపెడతానన్న ఈటల రాజేందర్

**హైదరాబాద్, :** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ నుంచి తనకు అందబోతున్న నోటీసుల అంశంపై బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తాను నోటీసులకు భయపడబోనని, కేసీఆర్ హయాంలో జరిగిన విషయాలను అవసరమైతే వెల్లడిస్తానని ఆయన హెచ్చరిక ధోరణిలో వ్యాఖ్యానించారు. ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ ఈటల పలు కీలక అంశాలను ప్రస్తావించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో తనతో పాటు మంత్రులుగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కడియం శ్రీహరి వంటి నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని, వారికి అప్పటి పరిస్థితులు తెలియవా అని ఈటల ప్రశ్నించారు. తాను ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఆ శాఖ కార్యదర్శిగా పనిచేసిన రామకృష్ణారావే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్‌ను విభేదించడానికి అందరూ జంకుతున్న రోజుల్లోనే తాను ఆరు నెలల పాటు ఎలా పోరాటం చేశానో తెలంగాణ సమాజం మొత్తం చూసిందని, కాబట్టి ఇలాంటి నోటీసులకు తాను భయపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. తనకు ఇంకా కమిషన్ నుంచి అధికారికంగా ఎలాంటి నోటీసులు అందలేదని, ఒకవేళ వస్తే పార్టీ అనుమతి తీసుకుని తప్పకుండా స్పందిస్తానని ఈటల తెలిపారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, వాటి పర్యవసానాల గురించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరినవారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన ఒక మంత్రివర్గ ఉపసంఘంలో తాను, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి సభ్యులుగా ఉన్నామని, ఆ కమిటీ కొనసాగుతుండగానే తెరవెనుక ఏం జరిగిందో త్వరలోనే మీడియాకు వెల్లడిస్తానని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇంజినీర్లే, ముఖ్యమంత్రి చెప్పినట్లుగానే ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టామని చెబుతున్నప్పుడు, ఇక మంత్రుల నిర్ణయాలపై ఏం విచారణ చేస్తారని ఈటల నిలదీశారు. తనకు నోటీసులు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభాసుపాలవుతారని ఆయన వ్యాఖ్యానించారు. విచారణ కమిషన్ గడువును పదేపదే ఎందుకు పొడిగిస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కమిషన్‌ను నిజంగా ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేశారా, లేక రాజకీయ బ్లాక్‌మెయిల్ కోసం వాడుకుంటున్నారా అని ఆయన ప్రశ్నించారు.

## ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటనతో కాసేపు ఆందోళనకర వాతావరణం నెలకొన్నప్పటికీ, మంత్రి సహా హెలికాప్టర్‌లోని వారంతా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓ అధికారిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి కోదాడకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరారు. హెలికాప్టర్ గాల్లోకి లేచిన కొద్దిసేపటికే ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. అప్రమత్తమైన పైలట్, వెంటనే హెలికాప్టర్‌ను సురక్షితంగా కిందకు దించేందుకు నిర్ణయించి, కోదాడ సమీపంలోని ఓ ప్రదేశంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన కోదాడ పర్యటనను రద్దు చేసుకుని, రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు తిరిగి పయనమయ్యారు. జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. హెలికాప్టర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించింది.

# తిరువూరు కౌన్సిలర్లను అభినందించిన వైఎస్ జగన్

మొదటి పేజి తరువాయి



తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా తమపై టీడీపీ నాయకుల దాడి, దౌర్జన్యం గురించి వైఎస్ జగన్‌కు కౌన్సిలర్లు వివరించారు. పోలీసులు, కూటమి నేతలు, టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన తీరును పార్టీ నేతలు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో మెజారిటీ లేకపోయినా బరితెగించి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను, దాష్టికాలను ధీటుగా ఎదుర్కొందామన్నారు. చట్టపరంగా, న్యాయపరంగా పార్టీ అండగా ఉంటుందన్న వైఎస్ జగన్.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా నిలిచినందుకు అభినందనలు తెలిపారు.

కీలక రాజకీయాంశాలపై వైఎస్ జగన్ ప్రెస్‌మీట్

గుంటూరు, : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేడు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. కీలక రాజకీయ అంశాలపై ఆయన మీడియా ద్వారా ప్రజలకు సందేశం ఇస్తారని పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో పాటు ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తగినంత సమయం మైక్ ఇవ్వని పరిస్థితుల్లో తాను మీడియా ముందుకు వచ్చి మాట్లాడతానంటూ వైఎస్ జగన్, కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తొలినాళ్లలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అధికారంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, ప్రతీకార రాజకీయాలను ఆయన ఎండగడుతూ వస్తున్నారు. అంతేకాదు.. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కొనసాగిన సంక్షేమం ఆగిపోవడం, ఉద్దేశపూర్వకంగా అన్ని వర్గాల లబ్ధిదారులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుండడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ డెలివరీ వాహనాలను నిలిపివేయడం లాంటి.. తాజా అంశాలపైనా ఆయన మాట్లాడే అవకాశం కనిపిస్తోంది.

### భయపెట్టి పాలించాలనుకుంటున్నారు...

## మద్యం కుంభకోణం జరగలేదు: మిథున్ రెడ్డి

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పరిపాలించాలనుకోవడం అవివేకమని ఆయన మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ తీరును తప్పుబడుతూ మిథున్ రెడ్డి పలు కీలక ఆరోపణలు చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రజల దృష్టిని మరల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలను రద్దు చేయడం సరైన చర్య కాదని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి మద్యం కుంభకోణం జరగలేదని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కట్టుకథలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, మద్యం కుంభకోణం జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ప్రచారమేనని కొట్టిపారేశారు. అనంతపురం జిల్లాలో గ్రామీణాభివృద్ధికి సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థకు అందే విదేశీ నిధులను నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని మిథున్ రెడ్డి అన్నారు. దీనివల్ల ఎంతోమంది పేదలకు అందే సాయం ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు లైనింగ్ పనుల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన సూచించారు. ఈ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తగవని అభిప్రాయపడ్డారు.

# కర్ణాటక విధానసౌధలో ఏనుగులను స్వీకరించిన పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి

కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "కుంకీ ఏనుగులను అత్యంత జాగ్రత్తగా చూసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి గారికి, అటవీ శాఖ మంత్రి గారికి మాట ఇస్తున్నాను. వాటి సంరక్షణను నేనే స్వయంగా పర్యవేక్షిస్తాను" అని హామీ ఇచ్చారు. గత రెండు దశాబ్దాలుగా జనావాసాల్లోకి అడవి ఏనుగులు చొరబడటం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఆస్తులు ధ్వంసమయ్యాయని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ రోజు మనకు అందిన ఈ కుంకీ ఏనుగుల వల్ల భవిష్యత్తులో ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతాం, ఆస్తి నష్టాన్ని కూడా నివారించగలుగుతాం" అని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడం, అటవీ సంపద పరిరక్షణ వంటి పలు కీలక అంశాల్లో ఇరు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని పవన్ వెల్లడించారు. "రెండు రాష్ట్రాల్లో వేర్వేరు రాజకీయ కూటములకు చెందిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణ అనే ముఖ్యమైన అంశంలో సహకరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయం. వారు కేవలం ఏనుగులనే కాదు, ఆంధ్ర ప్రజల కోసం వారి హృదయాన్నే తెరిచారు" అంటూ కర్ణాటక ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కుంకీ ఏనుగులకు సంబంధించిన ధృవపత్రాలను, సంరక్షణ వివరాల డాక్యుమెంట్లను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కు అందజేశారు. ఈ కుంకీల రాకతో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు కొంత ఊరట లభించనుంది.

# మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి

బీజాపూర్, చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. "నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. భద్రతా దళాలకు అభినందనలు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు.

నక్సలిజం నిర్మూలనలో ఇదో మైలురాయి: అమిత్ షా

"నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. భద్రతా దళాలకు అభినందనలు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు.

గణపతి తర్వాత పార్టీ పగ్గాలు

ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.

ఎంటెక్ టు నక్సలిజం

కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

అలిపిరి దాడిలో ప్రధాన సూత్రధారి కేశవరావు..

మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

## కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై కేటీఆర్ స్పందన

**హైదరాబాద్, :** కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి, కక్ష సాధింపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకమని సంచలన ఆరోపణలు చేశారు. దిక్కుతోచని స్థితిలోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గత 17 నెలలుగా పరిపాలనలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కనుమరుగై, కమీషన్ల రాజ్యం నడుస్తోందని విరుచుకుపడ్డారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే స్వయంగా కమీషన్లు లేనిదే పనులు జరగడం లేదని చెబుతున్నారు. దీనిని బట్టి రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి 8 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను, నల్గొండలో సుంకిశాల ప్రాజెక్టు కుప్పకూలిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం బాధితులకు సహాయం అందించడంలో, ఘటనలపై స్పందించడంలో విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. "కమీషన్ల మీద ఉన్న ఆరాటం, సహాయక చర్యలపై కూడా చూపలేకపోయారు. మృతదేహాలను వెలికితీయడానికి కూడా సాహసం చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది" అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు విషయంలో వెనక్కి తగ్గేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. "మీరు ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి? తులం బంగారం, నాలుగు వేల రూపాయల పింఛన్ల హామీ ఏమైంది? వీటిపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం" అని అన్నారు. చట్టాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఎప్పటికైనా న్యాయం, ధర్మమే గెలుస్తాయని, నిజాయతీ ఓడిపోదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నోటీసులు కేవలం చిల్లర ప్రయత్నాలని, దూదిపింజల్లా ఎగిరిపోతాయని కేటీఆర్ తేలిగ్గా కొట్టిపారేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, త్వరలోనే వారిని తిరస్కరించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

## బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటా

మొదటి పేజి తరువాయి

కార్యకర్తల బాగోగులు చూడటం తన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలానికి చెందిన దివంగత టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి లోకేశ్ నేడు ఉండవల్లి నివాసానికి పిలిపించి పరామర్శించారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంత్రి లోకేశ్ ను కలిసిన వెన్నా బాలకోటిరెడ్డి సతీమణి వెన్నా నాగేంద్రమ్మ, ఆయన సోదరుని కుమారులు వెన్నా నరసింహారెడ్డి, వెన్నా రామకృష్ణారెడ్డి తమ గోడును వెళ్లబోసుకున్నారు. బాలకోటిరెడ్డి హత్య జరిగిన తీరును, ప్రస్తుత ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను వారు మంత్రికి వివరించారు. హత్య కేసులో నిందితులు ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారని, కేసు విచారణను వేగవంతం చేసి, దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని వారు లోకేశ్ ను కోరారు. తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉపాధి హామీ, గృహ నిర్మాణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, నివాసం ఉంటున్న ఇల్లు కూడా తాకట్టులో ఉందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నారా లోకేశ్, వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల విడుదలకు కృషి చేయడంతో పాటు, పార్టీ తరపున ఇంటి తాకట్టును విడిపిస్తానని మాట ఇచ్చారు. హత్య కేసు నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో దాడులను ఎదుర్కొని నిలిచిన అంజిరెడ్డి తాత, మంజులారెడ్డి, తోట చంద్రయ్య వంటివారే మనకు స్ఫూర్తి. మీ కుటుంబానికి ఇంటి పెద్దకొడుకుగా నేను బాధ్యత తీసుకుంటాను" అని వారికి ధైర్యం చెప్పారు. మంత్రి లోకేశ్ తమకు అండగా నిలవడం పట్ల బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి సుమారు నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండదండలతో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఇంట్లో నిద్రిస్తున్న బాలకోటిరెడ్డిని తుపాకీతో కాల్చి చంపినట్లు ఆరోపణలున్నాయి. ఈ హత్యకు ఆరు నెలల ముందు కూడా ఆయనపై కత్తులతో దాడికి విఫలయత్నం జరిగింది. తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు గతంలో తెలిపారు.

# పాకిస్థాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం విఫలమయింది..

మొదటి పేజి తరువాయి

కేంద్రం చేజార్చుకుందని ఆయన ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే తీరులో మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో అమెరికాతో సహా పలు ప్రపంచ దేశాల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదురైనా, వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యుద్ధాన్ని కొనసాగించి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో తాము ఎలాంటి రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు. ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి ఎంతో వన్నె తెచ్చారని, భారతదేశాన్ని ఒక ఆర్థిక శక్తిగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో గట్టిగా వ్యవహరించేందుకు వచ్చిన సువర్ణావకాశాన్ని కేంద్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందని ఆయన మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం దేశంలో తొలిసారిగా తామే తిరంగా ర్యాలీ నిర్వహించామని సీఎం గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో, ప్రధానమంత్రికి మద్దతుగా నిలవాల్సిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆనాడు దుప్పటి కప్పుకుని పడుకున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో పార్టీల ప్రమేయం లేకుండా, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు. దేశ ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

### కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేస్తుంటే

## కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీ హయాంలోనే స్టీల్ ప్లాంట్ స్థాపించబడిందని, ఆ సమయంలో లాభాల బాటలో నడిచిందని వైఎస్ షర్మిల గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే "కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చిది చేయాలి" అన్న చందంగా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆమె ఆరోపించారు. ఇందులో భాగంగానే ఉద్యోగాలను తొలగించడం, ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకు అందకుండా చేయడం, సొంత గనులు కేటాయించకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ఉద్ధరించేందుకు రూ. 11 వేల కోట్లు ఇచ్చిందన్న ప్రచారం పూర్తిగా అబద్ధమని, ఇచ్చినట్లే ఇచ్చి అందులోంచి రూ. 8 వేల కోట్లను బ్యాంకు రుణాల కింద వెనక్కి తీసుకున్నారని ఆమె వివరించారు. మిగిలిన రూ. 3 వేల కోట్లు ఇవ్వాలంటే ఏకంగా 5 వేల మంది ఉద్యోగులను తొలగించాలని షరతు పెట్టారని, ఇది ప్లాంట్‌ను అదానీ వంటి వారికి కట్టబెట్టే కుట్రలో భాగమేనని షర్మిల ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని వైఎస్ షర్మిల మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు ఇది న్యాయంగా ఉందా అని ఆమె ప్రశ్నించారు. "ప్రధాని మోదీకి మీరు ఊడిగం చేస్తున్నారా? కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? మోదీతో లాలూచీ పడ్డారా? లేక ఈ కుట్రలో మీరూ భాగస్వాములా?" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఘనతే మోదీదే


అమరావతి,: ప్రపంచానికి భారతదేశం అందిస్తున్న గొప్ప వరం యోగా అని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని చెప్పారు. నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తామన్నారు. జూన్ 21న ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకూ 5 లక్షలమందితో కార్యక్రమం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా యోగాంధ్ర వెబ్ సైట్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఘనతే మోదీదే

యోగా అనేది మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భారతీయ జీవన విధానంలో ఒక భాగం. దీనికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ప్రధాని మోదీయే. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన దేశంలో చదువుకునేవారు. రానురాను విదేశీ దాడులతో అంతా కనుమరుగైంది. మళ్లీ ఇప్పుడు యోగా విలువ ప్రపంచానికి తెలిసేలా ప్రధాని మోదీ చేశారు. 2014 డిసెంబర్ లో యునైటెడ్ నేషనన్ జనరల్ అసెంబ్లీ ఆమోదించి ప్రపంచమంతా యోగా దినోత్సవం జరపాలని నిర్ణయించింది. యోగా అనేది ఒక ప్రాంతానికో, ఒక మతానికో సంబంధించినది కాదు. మనిషి జీవితంలో మెరుగైన జీవన ప్రమాణాలకు నాంది యోగా. నేటి ఆధునిక యుగంలో అందరూ పరుగులు పెడుతున్నారు. టెక్నాలజీతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతి దానికీ టెన్షన్ పడుతున్నారు. లైఫ్ మెకానికల్ గా మారుతోంది. వీటన్నంటిని నుంచి ఉపశమనం రావాలంటే యోగా ఒక్కటే మార్గం.

ఏపీ చరిత్రలో నూతన అధ్యయనం

రికార్డు సృష్టించేలా నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తాం. ఫోటోల కోసమో, ఈవెంట్ల కోసమే చేసే కార్యక్రమం కాదు. నెల మొత్తం పలు కార్యక్రమాలు నిర్వహించి యోగాపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించాం.



విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమందికి తగ్గకుండా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షలమందితో యోగా కోర్సులు చేయించి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. సముద్రం పక్కన ఇలాంటి యోగా నిర్వహించడం అరుదైన విషయం. సముద్ర తీరాన, ప్రకృతి ఒడిలో జరిగే ఈ కార్యక్రమం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

యోగాపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం

జూన్ 21న యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నందున మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని మంత్రుల బృందం దిశానిర్దేశం చేస్తుంది. పలు యూనివర్సిటీలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థల్లోని వాలంటీర్లు, మహిళలు, వృద్ధులు, పోలీసులు, ఉద్యోగులు యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి. అలాంటివారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తాం. పట్టణాలు, నగరాల నుంచి గ్రామస్థాయి వరకూ యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధాని మోదీ ప్రపంచమంతా యోగాను ప్రమోట్ చేస్తున్నప్పుడు మనకూ బాధ్యత ఉంటుంది కదా. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా కూడా చొరవ తీసుకుని యోగాను ప్రమోట్ చేయాలి. మంచి కంటెంట్ తో ఆర్టికల్స్ రాయాలి. మంచి వీడియోస్ తయారుచేయాలి. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాతో అసోసియేట్ చేసుకుని 2 వేలమంది యోగా శిక్షకులను తయారుచేస్తాం. యోగా ప్రాముఖ్యత తెలిపేలా స్కూల్ సిలబస్ లో పెడతాం.

ఆరోగ్యమే మహాభాగ్యం

అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యం. మన సమస్యలకు చక్కటి పరిష్కారం యోగా. అందరూ రోజూ ఒక గంట ప్రాణాయామం, ఆసనాలు, మెడిటేషన్ చేయాలి. వీటిని ప్రాక్టీస్ చేస్తే ఒత్తిడి మాయమై పనిని ఎంజాయ్ చేస్తారు. యోగా కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈషా, పతంజలి, బ్రహ్మా కుమారీస్ ఇలాంటి అసోసియేషపోలు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. వీరితో నేను ఎన్నో ఏళ్లుగా అసోసియేట్ అవుతున్నారు. అప్పట్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్, ఈషా సద్గురు వాసుదేవ్ తో ఐఏఎస్ , ఐపీఎస్, మంత్రులకు నేను క్లాసులు పెట్టించాను. బ్రహ్మకుమారీస్ ప్రపంచమంతా యూనిట్లు పెట్టారు... అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఈ మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సీపీఐ మండల మహా సభలు



త్రిపురాంతకం, మే 21 శుభోదయం న్యూస్, విలేఖరి గుత్తా చిన్న మూర్తేయ్య: త్రిపురాంతకం మండల మహా సభలను సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో బుధవారం సీపీఐ కార్యాలయం వద్ద జరిగింది.ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా మన్నెం అచ్చమ్మ,మండల కార్యదర్శి బాణాల రామయ్య వ్యవహారించారు.సీపీఐ జండాను పలుకురి చిన్న రామయ్య ఆవిష్కరించడం జరిగింది.ప్రజా నాట్యమండలి నాయకులు గుంటూరు వెంకటేశ్వర్లు అతని బృందం ఉద్యమ గీతలని ఆలపించారు.అసువులు బాసిన నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సంతాప తీర్మాణం కృష్ణ గౌడ్ ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి డి శ్రీనివాస్ మాట్లాడుతు కష్ట జీవులకోసం పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. భూస్వాములు, పెత్తనం దారుల వద్ద వున్నా అన్యాక్రాంత భూములను పంచేందుకు నిరంతరం పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. చండిగర్ లో జరుగు మహా సభను జయప్రదం చేయడానికి గ్రామ కమిటీ నుండి జిల్లా రాష్ట్ర కమిటీలు ఎన్నుకొకోవడం జరుగుతుంది అన్నారు.కేంద్రంలో ఆర్ యస్ యస్ కనుసన్నలో నడుసగున్న పార్టీ బిజెపి అని అన్నారు. ఎన్నికల వాగ్దాణంలో నల్లదనం వెలికి తెస్తామని ఇంతవరకు ఎందుకు బయటకు తీసుకురాలేక పోయారని ప్రశ్నించారు. కార్మీక హక్కు చట్టాలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటు పరంచేసినా ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అన్నారు. 750 మంది రైతులు పెద్ద ఎత్తున రైతుల చట్టాలను కాపాడేందుకు ఉద్యమం చేయడం జరిగిందని, విజయం సాదించడం జరిగింది అన్నారు.గత ప్రభుత్వంలో రాష్ట్రంలో నియంత పాలన చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు.నవరత్నాలపై చూపిన ప్రేమ ప్రజలపై చూపలేదాని ఎక్కడ అభివృద్ధి ఎక్కడ అంటూ విమర్శించారు. ఇప్పుడు అధికారంలో వున్నా తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన సూపర్ సిక్స్ ను అమలు చేయాలనీ అన్నారు. ఒక్క పెన్షన్ తప్ప మీరు అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి ఏమి లేదని గుర్తు చేసారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు కు పునరావాసం కాలనీలు కట్టించి త్వరగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి త్వరగా అందించి పూలసుబ్బయ్య ప్రాజెక్టు కి నీళ్లు అందించలని సూచించారు.త్రిపురాంతకం మండలంలోని చివరి భూములకు నీళ్లు అందించే విధంగా కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోవలన్నారు.కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలో వున్నా కేరళ రాష్ట్రం అవినీతి లేని రాష్ట్రంగా పేరు పొందినది గుర్తు చేసారు.నిరంతరం పేదలు, రైతుల పక్షాన నిలిచి పోరాడే పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అని కొనియాడరు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మహా సభలకు ప్రత్యేకను వివరించారు.కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా శతజయంతి వేడుకలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.కమ్యూనిస్ట్ పార్టీలో అ సభ్యులుగా ఉన్నందుకు మనం అందరం గర్వించాలి అన్నారు.తెలంగాణాలో జామిందార్ వ్యవస్థకు పేదలకు జరిగిన ఉద్యమంలో పేదల పక్షాన నిలబడి జామిందారి విధానం లేకుండ చేసినది కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు.




కొన్ని వేల ఎకరాలు పేదలకు పంచడం లో కీలక పాత్ర పోషించిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు,ఎద్దుల ఐశ్వరరెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు రావడానికి ప్రధాన పాత్ర పోషించింది అన్నారు. కార్పొరేట్ శక్తులను ఎదుర్కొంటున్న పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు.నిజాయితీకి సర్టిఫికెట్ పొందిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో వున్నా దేశం రాష్ట్ర అభివృద్ధి కి పాటుపడటం లేదు అన్నారు.జనాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం తీసుకొని నిరంతరం ప్రజా సమస్యల సాధనకై పోరాడాలని అన్నారు.అనంతరం సీనియర్ నాయకులు చెన్నయ్య మాట్లాడుతూ ప్రజల కోసం అనేక త్యాగాలు చేసిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు.నాగార్జునా సాగర్ రూపకల్పనకు ప్రత్యేక ఉద్యమాలు చేసి సాధించిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ అని కొనియాడారు. ఎంతో మంది త్యాగాల ఫలితంతో అనేక విజయాలు సాదించడం జరిగింది అన్నారు. 5 వ మండల మహా సభలకు నుండి నేటివరకు జరిగిన కార్యక్రమాలకు సంబంధించన వివరాలను సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య వివరించడం జరిగింది.వాటిని జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్,నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి మల్లికార్జున,సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, పవన్ కుమార్,దొరబాబు,ఆదినారాయణ,నుర్జహాన్, ఆదిలక్ష్మి,వెంకటరావు మరికొందరు నాయకులు, నాయకురాళ్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె రత్నాకర్ సూచించారు. బుధవారం రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్ సీ లేబొరేటరీలో జరుగుతున్న పరీక్షల వివరాలు, అవి జరుగుతున్న తీరు పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పీహెచ్ సీ వైద్యురాలు డాక్టర్ హేమ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్, అతిసార వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. పరిసరాల పరిశు భ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించి శుభ్రం చేయడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. స్థానిక ప్రభుత్వ వసతి గృహాలకు వెళ్లి మలాథియాన్ స్ప్రేయింగ్ పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో అంకమ్మరావు,కోటేశ్వరరావు, దుర్గారావు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నవ భారత నిర్మాణ సృష్టికర్త 'రాజీవ్ గాంధీ'



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): బడుగు బలహీన వర్గాల నాయకునిగా, నవభారత నిర్మాణ సృష్టికర్తగా దేశానికి దిశా నిర్దేశం చూపిన మార్గదర్శకుడు రాజీవ్ గాంధీ అని సీనియర్ కాంగ్రెస్ నేత కర్నాటి కోటయ్య అన్నారు. రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్క ఉన్న విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా డీసీసీ కార్యదర్శి రాగిడి ప్రతాప్ బాబు మాట్లాడుతూ దేశాన్ని టెక్నాలజీ రంగం వైపు తీసుకెళ్లిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. దేశ ప్రధానిగా ప్రజలకు చేసిన సేవలు, అభివృద్ధి స్ఫూర్తిదాయకమన్నారు.అనంతరం సీనియర్ నేత కోటయ్య మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికి అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత రాజీవ్ దే అని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో అనేక విప్లవాత్మక సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో జాకబ్ రాజు, ముసలయ్య, సురభి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వంశీ మోహన్ అక్రమ కేసులు నుండి బయట పడాలని పూజలు





గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : వంశీ మోహన్ మంచి ఆరోగ్యం, అక్రమ కేసులు నుండి బయట పడే విధంగా దివించాలని ఆమజనేయ స్వామిని కోరుతూ ఈ రోజు గన్నవరం గుడిలో జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి నాయకత్వన కొబ్బరికాయలు కొట్టిన వైస్సార్సీపీ శ్రేణులు.పేదలపాలిటీపెన్నిది,ఆపదబంధవుడు,వల్లభనేని వంశీ మోహన్ ని రెడ్డ్ బుక్ రాజ్యాంగం కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు బానాయించి 100 రోజులు పైన జైలులో ఉంచారు. ఆయన ఆరోగ్యం క్షిణించింది అన్ని కేసులలో బెయిల్ వచ్చిననుజైలు నుండి బయటకు రానీయకుండా అధికారా దుర్వినియోగం చేస్తూ మరి కొన్ని కొత్త కేసులు పెట్టి మాసికంగా విబ్బంది పెడుతున్నావారికి బూద్ధి ప్రసాదించి వంశీ వెంటనే బెయిల్ వచ్చే విధంగా దివించాలని గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి అంజనేయస్వామికి వంశీ ఫొటో ప్లే కార్డులతో వెళ్లి కొబ్బరికాయలు కొట్టి వేడుకున్నట్లు తెలిపారు.అంతే కాదు వంశీ శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నారు. అయిన పై కక్షా సాధింపు చర్యలు ఆపటం లేదు. అందువలన ఆటంకం పెట్టే కూటమి నాయుకులుకు సరిఅయినా బుద్ధి చెప్పి వంశీ మంచి ఆరోగ్యం ప్రసాదించి ఆయనను వెంటనే బెయిల్ పై వచ్చే విధంగా దివించాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ రోజు మేమే కాదు వైస్సార్సీపీకార్యకర్తలు నాయుకులు, గన్నవరం నియోజకవర్గం లోని ప్రజలు రాష్ట్రము లోని వంశీని అభిమానించే ప్రజలందరు దేవాలయాలలో వంశీ పై పెట్టిన అన్ని కేసులు అక్రమైనవి అని ప్రార్ధనలు చేస్తున్నారని ఆమే తెలిపారు. ఈకార్యక్రమంలోవైస్సార్సీపీ నాయుకులు,మాదు వేణు,పామర్తి రాజేష్, పలాగని మహేష్, పామర్తి సాయి, పలాగని ఉపేంద్ర పామర్తి ప్రభాస్,యోగ,కార్యకర్తలు, గన్నవరం ఎంపీటీసీ తిరివీదు రవి,వార్డ్ మెంబర్ రత్న మాల, వి పద్మ, రజిని, పూజిత,తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి శరతులు లేకుండా రేషన్ కార్డులను మంజూరు చేయాలి

ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): స్థానిక నంద్యాల సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వము చేపట్టినటువంటి రేషన్ కార్డుల తొలగింపు, చేర్పింపు కార్యక్రమాల్లో భాగంగా విడుదల చేసినటువంటి ప్రభుత్వం పెట్టినటువంటి షరతులు వల్ల ప్రజానికం చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని, అంతేకాకుండా ఈ షరతుల వల్ల వెబ్సైట్లో సక్రమంగా పనిచేయక, సర్వర్లు సరిగా పనిచేయక అడిగినటువంటి ఆప్షన్ తీసుకునే లోపే ఇంకో ఆప్షన్ అడగడం సర్వర్లు బిజీగా రావడం ఇటువంటి సమస్యల వల్ల ప్రజానికం తీవ్రంగా ఇబ్బందులకు గురి అప్లై చేయడానికి వెళ్ళినటువంటి సందర్భంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నెట్ సెంటర్లో వద్ద పడి కాపులు కాయాల్సినటువంటి పరిస్థితి ఏర్పడుతుందని, అంతేకాకుండా కొత్తగా రేషన్ కార్డులకు అప్లై చేసుకున్నటువంటి వారికి పెళ్లయితే వివాహ ధ్రువీకరణ పత్రం కంపల్సరీ కావడం వల్ల వాటి వల్ల కూడా చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఇలా ప్రజలు ప్రభుత్వం పెట్టినటువంటి చరిత్ర వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి రేషన్ కార్డుల ప్రక్రియలో ప్రజలకు ఎటువంటి చెరతులు లేకుండా ఇబ్బందులు లేకుండా అప్లై చేసుకుని రేషన్ కార్డులను పొందేందుకు అవకాశం కల్పించేందుకు అధికార ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు దారి చేయాలని వారు తమ అధికారంలోకి విమానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నంద్యాల పట్టణ నాయకులు అంజి, శరత్, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## యోగ అనేది భారతీయ సంస్కృతి అందించిన గొప్ప బహుమతి: ఎన్ఎండి ఫిరోజ్.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): అంతర్జాతీయ యోగా దిన మాసోత్సవ ప్రారంభ వేడుక కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి ఘనియా చేతులా మీదుగా ఘనంగా ప్రారంభించారు..ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని నంద్యాల ప్రజలతో కలిసి ఎన్ఎండి ఫిరోజ్ వివిధ యోగసనాలు చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ యోగ చేయడం వల్ల శారీరక మరియు మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. యావత్తు ప్రపంచం యోగ ఉపయోగాలు తెలుసుకొని యోగను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నరాని దాని వల్ల ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగ వల్ల ఎన్నో రోగాలు నయామవుతాయన్నారు. తాను కూడా పనుల బిజీ నుండి కాస్త ఉపషామానం కోసం తరుచూ యోగ చేస్తుంటాని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ గారు, యోగ గురువులు, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి,జిల్లా ఉన్నతాధికారులు నంద్యాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యర్రగొండపాలెంలో కొలహాలంగా మినీ మహానాడు, భారీగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు






ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారీ టీడీపీ శ్రేణుల కోలాహలంలో మినీ మహా నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మరియు పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ సెంటర్ వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం ర్యాలీగా టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకొని తెలుగుదేశం పార్టీ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో మహానాడు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం నియోజకవర్గ తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వరలాదిగా పాల్గొన్నారు.

## ఎర్రగొండపాలెం ఉపాధి హామీలో అంతులేని అవినీతి పనికి పోకుండానే పోయినట్లు హాజరు ఒక్కొక్క కూలి నుండి వరానికి 300 వసూలు

కీలక పాత్ర పోషిస్తున్న టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు



ఎర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): పేదలకు ఉపాది కల్పించేందుకు కేంద్రం ప్రభుత్వం చేపట్టిన ఉపాది హామీ పథకం ఎర్రగొండపాలెం మండలంలో ఆదికార పార్టీ నేతలకు, అధికారులకు ఆదాయ వనరుగా మారింది. పేద కూలీలకు చెందాల్సిన సొమ్మును అదికార పార్టీ పేరుతో ఆనదికారముగా చలామణి అవుతున్న సీనీయరు మెట్లు.. టిక్నికల్ అసిస్టెంట్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్రగొండపాలెం మండల పరిధిలో పనులు చేయకుండా చేసినట్లు చూపడం. క్షేత్ర స్థాయిలో మూరెడు పనిచేస్తే కొలతల్లో బారెడు నమోదు చేయడం పరిపాటిగా మారింది. అవినీతి తంతులో అధికారులు అధికారపార్టీ నేతలు చేతులు కలిపి పథకాన్ని కల్పతరువుగా మార్చుకుంటున్నారు.మస్టర్లల మాయతో మమూళ్ల వసూలుఉపాది అవినీతి మస్టర్ల మాయతోనే ప్రారంభమవు తోంది. మీరు ఎక్కడ ఉన్నా మీ పేరుతో మస్టర్లు నమోదు చేస్తాం' అంటూ ముందుగా క్షేత్రస్థాయిలో ఉండే షీల్డ్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు ముందుకు వస్తారు. దాని కోసం సుదూర ప్రాంతాల్లో ఉన్న వారికికూడా పనిచేసినట్లు చూపుతారు. వీరు ప్రతి వారం రూ.300 వరకు ఇవ్వాలి. ప్రతి బుధవారం క్షేత్రసహాయకుడికి వీరు నగదు అందజేయాలి వారి నుంచి పై అధికారులకు మూములు వెళుతుందన్నది బహిరంగ రహస్యమే. ఇక ఇలా ఇచ్చిన వారికి మస్టర్లు కొట్టి వారి బ్యాంకు ఖాతాలో నగదు పడేలా మాస్తారు. ఇలా ఎర్రగొండపాలెం మండలంలో భారీగా అవినీతి జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిత్యం కొంతమంది మంది పనిచేస్తే మస్టర్లలో మాత్రం వేల మంది పనిచేసినట్లు చూపుతూ అనధికార వసూళ్లకు పాల్పడు తున్నారన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారంపై గట్టిగా మాట్లాడిన పై అధికారులకు కూడా ప్రజాప్రతినిధులునుంచి ఫోన్లు చేయించి బెదిరిస్తుననట్లు తెలుస్తోంది. వారానికి లక్షల్లో వసూళ్లు ఒక్క ఎర్రగొండపాలెం మండలంలో అన్ని పంచా యతీలలో ఒక్కో కూలీ నుంచి రూ.300 చొప్పున వసూలు చేస్తున్నారు. ఐలా ఒక్క వారంలోనే లక్షలు చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు స్పందించి అక్రమ వసూళ్లపై పూర్తిస్థాయిలోవిచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# శివయ్య సేవలో రష్మీ ఠాగూర్




శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని బుధవారం మిస్ ఏసియా,జాతీయ చేనేత అంబాసిడర్ రష్మీ ఠాగూర్ దర్శించుకున్నారు.ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు.దర్శనానంతరం మృత్యుంజయ సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక తీర్థ ప్రసాదాలు అందజేశారు. రష్మీ ఠాగూర్ మాట్లాడుతూ చాలామంది భక్తులు తిరుమల దర్శనం అయిన తరువాత తప్పకుండా శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే రాహు కేతు పూజలకు మొగ్గు చూపుతున్నారని అనంతరం స్వామిని దర్శించుకోవడం వల్ల మంచి ఫలితాలు లభిస్తున్నాయని, రానున్న రోజుల్లో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చాలా అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు.అదేవిధంగా సౌత్ ఇండియాలో మిస్ వరల్డ్ పోటీలు చాలా సంతోషమని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కూడా మిస్ ఏసీయా లాంటి పోటీలను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నిర్వహిస్తే చాలా బాగుంటుందని దాంతోపాటు ఏపీలో ఉండే అమ్మాయిలు కూడా మంచి అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. ప్రభుత్వానికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలియజేశారు.

## బూచేపల్లిని

## మర్యాదపూర్వకంగా కలిసిన వార్డ్ మెంబర్ యిర్రికృష్ణారెడ్డి



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని పామూరు పట్టణ రెండో వార్డ్ మెంబర్ ఇరికి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పట్టణంలో పలు సమస్యల గురించి వారికి తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి (బన్నీ), వైఎస్ఆర్సిపి నాయకురాలు సుభాషిని, షేక్ గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రామిశెట్టి వారి

## వివాహ వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రమా శ్రీనివాస్,జనసేన పార్టీ నాయకులు రామిశెట్టి సునీల్ కుమార్,ఉప్పలపాటి హరిబాబు, పిడుగు శ్రీనివాసులు,మెంట నరసింహారావు, వాయినేని రాఘవ,వరికుటి చిరంజీవి, తోట రవికుమార్,గుత్తి రాజా తదితరులు నూతన దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## తొట్టంబేడు మండలాన్ని

## ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా రావిళ్ళ.మునిరాజు నాయుడు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : నియోజకవర్గంలోని తొట్టంబేడు మండల అధ్యక్షుడిగా రావిళ్ల . మునిరాజు నాయుడు నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మునిరాజా నాయుడు బుధవారం ఆయన నివాసంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు . . ఈ సందర్భంగా మునిరాజ నాయుడు మాట్లాడుతూ దివంగత నేత స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రాజకీయంలో ఉన్నప్పుడు నుండి ఆయనతోపాటు పని చేశానని ఆయన నీతి నిజాయితీతో కూడిన రాజకీయం చేశాడని దగ్గరుండి చూశానని అన్నారు. మండలంలో శాంతిభద్రతలకు ఎక్కడ భంగం కలగకుండా చూస్తానన్నారు.అదేవిధంగా అవినీతికి తమ పార్టీ వారైనా పాల్పడితే ఎవరిని క్షమించేది లేదని అన్నారు.మండలంలో అధికారులు పనితీరు బాగుందని ఒకరు ఇద్దరు అధికారులు పై తమకు ఆరోపణలు కూడా వస్తున్నాయని వాటిని కూడా సరి చేసే విధంగా చూస్తామని అన్నారు.మండలంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి దక్కే విధంగా కృషి చేస్తామన్నారు. తొట్టంబేడు మండలం టిడిపి పార్టీకి కంచుకోట అన్నారు. టిడిపి పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి సముచిత స్థానాన్ని కల్పించే విధంగా చూస్తామన్నారు.తొట్టంబేడు మండలంలో ప్రస్తుతం ఏవైతే అభివృద్ధి పనులు జరగాల్సి ఉన్నాయో వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటిని పూర్తి చేసే విధంగా చూస్తామన్నారు.బొజ్జల ఎటువంటి రాజకీయం చేశారో అదేవిధంగా చేస్తామని అన్నారు.తొట్టెంబెడు మండలంలో ఏపీఐఐసి భూముల్లో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.తొట్టంబేడు మండలం పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## బిట్ర గుంటలో ప్రారంభమైన రైల్వేస్టేషన్ రోడ్డు నిర్మాణం పనులు




బిట్రగుంట: (శుభోదయం న్యూస్) : లిటిల్ ఇంగ్లాండుగాపిలువబడుతూ గతమెంతో ఘనంగావెలుగొంది, వర్తమానంలోదుర్భరపరిస్థితులు ఎదుర్కొంటున్న బిట్రగుంటరైల్వే ఎన్నోకార్మికసంఘాలు ప్రజాప్రతినిధులు రైల్వే ఉన్నతాధికారులకుచేసినవిజ్ఞప్తుల మేరకుత్వరలో పూర్వవైభవం సంతరించుకునేదిశగాఅడుగులు పడుతున్నాయి. ఈక్రమంలో గతంలోమూతపడ్డ విశ్వనాథరావుపేటనుండిరైల్వే స్టేషన్ కువెళ్లేరోడ్డుమార్గం పునర్నిర్మాణపనులుబుదవారం ప్రారంభమయ్యాయి. ఇదేక్రమంలో బోగోలుపరిసరమండలాల ప్రజలనుఎంతోకాలంగాఅందని ద్రాక్షలావూరిస్తున్న144లెవెల్ క్రాసింగ్ పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికిమంగళవారంసర్వే నిర్వహించడంజరిగింది.త్వరలోనాలుగువరసలరోడ్డునునిర్మించి కడప,బద్వేల్ రోడ్డుతోపాటు జువ్వలదిన్నెలోనిఫిషింగ్ హార్బర్, సున్నంబట్టిలోనిర్మించనున్న ఎయిర్ పోర్టు,కృష్ణపట్నం, రామాయపట్టణాలకు అనుసంధానించనున్నారు. సీనియర్ సిటిజెన్లఅభిప్రాయం మేరకుబిట్రగుంటకుపూర్వవైభవం వచ్చేపరిస్థితులుత్వరలోనే ఉన్నట్లుతెలుస్తోంది.ఇదేజరిగితే బిట్రగుంటలో నివందలాదిఎకరాల రైల్వేభూములువినియోగంలోనికి రావడంతోపాటు, వేలమంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగాఉపాధి లభించనుంది.

## బిట్రగుంట అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తాం - డా.రాఘవయ్య



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: పెన్షనర్ అసోసియేషన్ బిట్రగుంటసభ్యులు రైల్వేకార్మికసంఘం నాయకుడు డాక్టర్ మర్రిరాఘవయ్యను బుధవారం గూడూరులోకలవడం జరిగినది. బిట్రగుంటరైల్వే సమస్యల్లో భాగంగావిక్రమసింహపురిని బిట్రగుంటలోఆపాలని విన్నవించడంతోవారు సానుకూలంగాస్పందించిరైల్వే జనరల్ మేనేజరుతో మాట్లాడతారనిహామీఇచ్చినారు. అంతేకాకుండా బిట్రగుంటలో ఉన్నటువంటి వీకెండ్ ల్యాండ్ ఏదోఒక ప్రాజెక్టునుఎస్టాబ్లిష్ చేసి బిట్రగుంటఅభివృద్ధికి తోడ్పడుతాననిఅవసరమైతేచైర్మన్ రైల్వేబోర్డుతోకూడా మాట్లాడుతాననిహామీఇచ్చారు.,అలాగేమినిస్ట్రీఆఫ్ రైల్వేతోకూడామాట్లాడుతానన్నారు.త్వరలోవిక్రమసింహపురిఎక్స్ప్రెస్ కూడామళ్లీరిహాల్ట్ ఇప్పించిఅన్ని రైళు బిట్రగుంటలోఆగేవిధంగాజనరల్ మేనేజర్ తో మాట్లాడుతాననిహామీఇవ్వడంతో బిట్రగుంటబ్రాంచ్ అసోసియేషన్ చైర్మన్ చెంచయ్య,సెక్రెటరీగోవిందరాజులు, వర్కింగ్ చైర్మన్ యన్.యస్.యాదవ్ మరియుకమిటీసభ్యులుఆయనకు ధన్యవాదాలు తెలపడంతోపాటు ఘనంగాసన్మానించడం జరిగింది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సౌకర్యాలు ఏర్పాటుకు కృషి




(శుభోదయం న్యూస్) బిట్రగుంట: మండల కేంద్రమైన బోగోలులోని ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రాంగణంలోరిటైర్డ్ రైల్వేఉద్యోగి పరిమిసీతారామయ్యతనతల్లి స్వర్గీయకనకదుర్గంబజ్ఞాపకార్థం విద్యార్థినీవిద్యార్థులకుక్రీడా ప్రాంగణంలోసౌకర్యాలుఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈమేరకు కళాశాలప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తోకలిసిబుధవారంక్రీడా ప్రాంగణాన్నిపరిశీలించారు. విద్యార్థినివిద్యార్థులలోక్రీడా ప్రతిభనుఇనుమడింపచేసేందుకు షటిల్ కోర్ట్, వాలీబాల్ కోర్ట్ తోపాటుక్రీడాసామాగ్రితదితర సౌకర్యాలుకల్పించేందుకుసిద్ధంగా ఉన్నట్లుతెలిపారు. ఈసందర్భంగా దాతసీతారామయ్యకళాశాల సౌకర్యాలకల్పనకు ముందుకొచ్చినందుకు ఆయననుకళాశాలఅద్యాపకులువిద్యార్థులు అభినందించారు.

# గన్నవరంలో ఈనెల 28న జాబ్ మేళా




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 28వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలోని యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గాను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుండి ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించే ఈ జాబ్ మేళాలో ఏడవ తరగతి నుంచి పదవ తరగతి, ఇంటర్,డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ పాస్ అయిన యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరై తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాన్ని పొందాలని వారు సూచించారు. ఈ జాబ్ మేళాలో కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలలోని పదికి పైగా ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ కంపెనీ అవసరాలకు కావలసిన యువతను ఎంపిక చేస్తారని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫోటో స్టార్ట్ కాఫీలు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494005725, 6300618985, 9666654641 లో సంప్రదించాలని సూచించారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తన క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు.

## హనుమాన్ శోభాయాత్ర ను

## జయప్రదం చేయండి బిజెపి నేత విజయ్ కుమార్ చారి



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 22 తేది గురువారం ఉదయం 9:0 గంటలకు పామూరు పట్టణంలో హనుమాన్ విజయ శోభాయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు బిజెపి నేత పెరమన విజయ్ కుమార్ చారి తెలిపారు. అనంతరం మాట్లాడుతూ హనుమాన్ విజయ శోభాయాత్ర పామూరు లోని మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద నుండి పట్టణంలోని పురవీధుల గుండా దైవభక్తి,దేశభక్తి పాటలతో తీన్మార్ డ్రమ్స్ తో, అంగరంగ వైభవంగా ఈ హనుమాన్ విజయ శోభాయాత్ర కు హైందవ సోదరులు, హిందూ బంధువులు పామూరు పరిసర ప్రాంత ప్రజలు అందరూ ఈ హనుమాన్ శోభాయాత్రలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొ%శీ%దగలరని కోరుకుంటున్నాము. అనంతరం హనుమాన్ శోభాయాత్ర కు విచ్చేసిన ప్రతి ఒక్కరికి మదన వేణుగోపాలస్వామి దేవస్థానం లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కలదు. కావున అందరూ పాల్గొని హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము.

## అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన




పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ - శీనివాసరావు (శుభోదయం నూస్): పల్నాడు జిల్లా పిడుగురాల్ల శ్రీ వాసవి కళ్యాణమండపంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పై ఈరోజు అవగాహనా సదస్సు పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

## కఠిన చర్యలు... జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటేల్....




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): కర్నూలు జిల్లాలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటేల్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని జొన్నగిరి, తుగ్గలి పోలీస్టేషన్ ల ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లలోనే రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలో ఉన్న పరిస్థితులపై పోలీసులు ను అడిగి ఆరా తీశారు. అనంతరం శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు, ప్రభుత్వ చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను పోలీసులకు సూచించారు. అలాగే తుగ్గలి పోలీస్ స్టేషన్లో శిథిలావస్థకు చేరిన పోలీస్ కోటర్స్ లను ,పాత పోలీస్ స్టేషన్ ను పరిశీలించారు. పోలీసులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల సమస్యల పరిష్కరించేందుకు కూడా చర్యలు చేపడతానని తెలిపారు .ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటరామయ్య, రూరల్ సీఐ పులి శేఖర్, ఎస్ఐ లు కృష్ణమూర్తి ,మల్లికార్జున, పోలీసులు పాల్గొన్నారు.

## చెరుకులపాడు నారాయణరెడ్డి

## సమాధి వద్ద నివాళులర్పించిన వైసీపీ నేతలు...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ భర్త, వైసిపి ఇన్చార్జి స్వర్గీయ నారాయణ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా చెరుకులపాడు గ్రామంలో నారాయణరెడ్డి సమాధి వద్ద బుధవారం తుగ్గలి మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఎంపీపీ గౌరవ సలహాదారుడు హనుమంతు, కడమకుంట్ల అమర్నాథ్ రెడ్డి, లంకాయపల్లె హనుమంత్ రెడ్డి,



జొన్నగిరి గుంతా రఘు ,ఎల్లమ్మ గుట్ట తండా వైసిపి నాయకులు బాబు నాయక్, నాయకులు కార్యకర్తలు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గౌరవ సలహాదారుడు హనుమంతు వైఎస్ఆర్సిపి నాయకులు కడమకుంట్ల అమర్నాథ్ రెడ్డి గుంత రఘు లు మాట్లాడుతూ స్వర్గీయ నారాయణ రెడ్డి పేద ప్రజల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అలాగే పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధికి కూడా ఎంతో కృషి చేశారని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ ను కలిసిన వైసిపి నాయకులు...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ను వైసిపి ఐటి విభాగపు అధ్యక్షులు తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు తుగ్గలి ప్రవీణ్ కుమార్ రెడ్డి లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి నేత స్వర్గీయ చెరుకులపాడు నారాయణరెడ్డి ఎనిమిదో వర్ధంతి సందర్భంగా చెరుకులపాడు లో నారాయణరెడ్డి సమాధి వద్ద వారు నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## మహానాడు కార్యక్రమంలో ప్రముఖ టిడిపి నాయకులు



(శుభోదయం న్యూస్)బాపట్ల : తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ జిల్లా మహానాడు కార్యక్రమం బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి , రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వర్యులు గొట్టిపాటి రవి కుమార్ బాపట్ల పార్లమెంట్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ , బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు,వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనంద్ బాబు చీరాల నియోజకవర్గ శాసన సభ్యులు మాల కొండయ్య పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సంతనూతలపాడు శాసన సభ్యులు బి యన్ విజయ్ కుమార్ తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మేము సైతం పవన్ తోనే చిరంజీవుల నరసింహారావు జనసైనికుడు



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా: మేము సైతం జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో అని బిసి జనసేన సీనియర్ నాయకులు చిరంజీవుల నరసింహారావు అన్నారు, మాకు పదవులు లేకపోయినా ఒక కార్యకర్తగా జనసేనకు పని చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు, జనసేన పార్టీలో ఉంటూ జన సైనికుల ఐక్యత కోసం చివరిదాకా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు,

## తీవ్రవాద వ్యతరేక దినోత్సవంగా మాజీ ప్రధాని రాజీవగాంధీ వర్దంతి రోజు

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు,

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్



తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటీ శివ కుమార్ (శుభోదయం న్యూస్),మే 21: దేశంలో తీవ్రవాద వ్యతరేక దినోత్సవంగా మాజీ ప్రధాని రాజీవగాంధీ వర్దంతి రోజును నిర్వహిస్తున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ అన్నారు. రాజీవగాంధీ ముప్పై ఐదవ వర్దంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు న్యూ బోయిన్ పల్లి ప్లే గ్రౌండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిధిగా హాజరైన జంపన ప్రతాప్ మాట్లాడుతూ తనతల్లి ఇందిరాగాంధీ హత్యానంతరం అతి పిన్న వయస్సులోనే దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ ఎన్నో సంస్క రణలు ప్రవేశపెట్టారని అన్నారు. యువత కోసం ఐటీ రంగాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులూ బంగారు సదానంద్. బల్వంత్ రెడ్డి. మారూతి గౌడ్. సాయిబాబా యాదవ్. ముకేశ్ యాదవ్. వరప్రసాద్. శశి. టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34 వర్ధంతి సందర్భంగా...... పరకాల యూత్ కాంగ్రెస్ రక్తదాన శిబిరం ఏర్పాటు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్): దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన ధీరోద్దాత, ఆధునిక భారత నిర్మాత నవయువ స్ఫూర్తి ప్రదాత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ..దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు యూత్ కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా మరియు పరకాల ఎమ్మెల్యే గౌరవ రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి కృష్ణ కాంత్ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా పరకాల పట్టణంలో స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ లో రక్తదానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బొచ్చు కోమల–జెమిని యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ మంద శ్యామ్ యూత్ కాంగ్రెస్ నడికూడా మండల అధ్యక్షులు అప్పం కుమారస్వామి, పరకాల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అల్లం శ్రీరామ్ ఈ కార్యక్రమన్నీ ఉద్దేశించి వారు మాట్లాడుతూ మన దేశ సమైక్యతను,సమగ్రతను కాపాడిన గొప్ప ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఐటీ రంగానికి పునాదులు వేసిన గొప్ప మార్గదర్శి నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు రాజీవ్ గాంధీ అని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ చేతుల మీదుగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ



చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ గారు,మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, మాజీ ఎంపిటిసి మల్లారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొమ్మ కంటి చంద్రమౌళి, పరకాల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజ్,మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు మోహన్, బొచ్చు అనంత్, ఒంటేరు వరుణ్, మడికొండ సంపత్, జూపాక కిషన్, బొమ్మకంటిరాజేష్, బొచ్చు సంపత్,బొచ్చు విద్యాసాగర్,బన్నీ మరియు హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ లో చేరిన ఆర్ జి 1 సెక్టర్ 2 సింగరేణి కాంట్రాక్ట్ సివిల్ కార్మికులు



గోదావరిఖని టౌన్, రిపోర్టర్– సురేష్, (శుభోదయం న్యూస్): అర్ జి 1 సెక్టర్ 2 లో పనిచేస్తున్న సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు 20 మంది ఈ రోజు సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘంలో చేరారు. వీరికి రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి,గోదావరిఖని పట్టణ కార్యదర్శి



ఎం.సారయ్య గార్లు కార్మికులకు కండువాలు కప్పి సంఘంలో కి ఆహ్వానించారు.ఈసందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై సంఘంలో చేరిన సివిల్ కాంట్రాక్టు కార్మికులకు విప్లవ అభినందనలు తెలియచేశారు. భవిష్యత్తు లో కార్మికుల సమస్యల పరిష్కారానికై జరిగే పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సంఘం పై నమ్మకంతో సంఘంలో చేరిన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని అన్నారు. అదేవిధంగా సిఎంపీఫ్ సమస్య కార్మికులను తీవ్రంగా కలచివేస్తుందనీ అన్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం చొరవ చుపాలని, సమస్యను పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు.సంఘంలో చేరినవారు నీరటి వేణు,చలిగంటి శంకర్,శ్రీపెల్లి వీరచారీ, జూపాక సాగర్, సరిగొమ్ముల మధు,పొన్న విజయ్,సంగెం శేఖర్,రాసమల్ల గౌరీ, తంగల్లపెల్లి రాజేష్, ఒర్సు అనిల్,నసుపురి సత్యం, గొడిసెల కమలాకర్, లింగబత్తుల శ్రీను,దుస్సా సారయ్య, బక్కతట్ల వెంకటేష్, పెరుక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోనీ రాజీవ్ గాంధీ విగ్రహానికిపూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.దివంగత నేత రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా సేవలందించి ఐటీ సాంకేతిక రంగాన్ని దేశంలో తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి,మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య,నాయకులు బత్తిని సహదేవ్ గౌడ్, శివయ్య గౌడ్,కాసుల వెంకన్న గౌడ్,బత్తిని సత్యనారాయణ గౌడ్, రేఖల ప్రభాకర్ గౌడ్, వులిపే మల్లేశం, చిలుకూరి సత్తిరెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాబా,కీర్తి రమేష్,దండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన భారతదేశ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ వర్ధంతి

ఘనంగా నివాళులర్పించిన

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి, శుభోదయం న్యూస్): భారతదేశ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, నవ భారత నిర్మాతగా పేరు గాంచిన స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఘనంగా నివాళులు అర్పించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న మహానేత విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తూ, ఆయన సేవలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, జీహెచ్ఎంసీ మేయర్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ కూడా పాల్గొని, భారతదేశం కోసం రాజీవ్ గాంధీ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ను నవ భారత యువతకు స్ఫూర్తి ప్రదాతగా అభివర్ణించారు.ఈ రోజు "అంతర్రాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం" ( ఆంటీ – టెర్రరిజం డే) సందర్భంగా దేశమంతటా రాజీవ్ గాంధీ గారి ఆలోచనలు, దేశభక్తిని స్మరించుకోవడం గర్వకారణంగా నిలుస్తోంది.



## జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగిన తబితా ఆశ్రమంలో ఉన్న నిరుపేద యువతి వివాహం

పెళ్లి పెద్దగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి (శుభోదయం న్యూస్): రామగుండంలో ఉన్న తబితా ఆశ్రమంలో ఉన్న నిరుపేద యువతి మానస వివాహాన్ని జిల్లా కేంద్రంలో సాంప్రదాయ బద్దంగా ఘనంగా నిర్వహించడం జరిగిందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన మానస చిన్న తనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన నేపథ్యంలో రామగుండంలో ఉన్న తబితా ఆశ్రమంలో చేరిందని పేర్కొన్నారు. మానస ఆశ్రమం లో చేరినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు పదహారు సంవత్సరాల పాటు తబితా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్ విమల దంపతులు వారి పిల్లల వలె విద్యా బుద్ధులు నేర్పించి పోషించడం



జరిగిందని ఆయన అన్నారు. మానస ఆశ్రమంలో ఉంటూ డిగ్రీ చదువు పూర్తి చేసిందని, అదే విధంగా ఆశ్రమంలోని పిల్లలందరికి విద్య బుద్దులు నేర్పించేదని ఆయన అన్నారు. మానస కు జనగామ జిల్లా కు చెందిన యువకుడితో గత కొన్ని నెలల క్రితం పెళ్లి సంబంధం నిశ్చయం జరిగిందని, మానస వివాహం ఘనంగా నిర్వహించేందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్ వివిధ శాఖ అధికారులు అదే విధంగా పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మానస వివాహం ఘనంగా జరిపించేందుకు తగిన సహకారం అందించడం జరిగిందని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ పెళ్లి పెద్దగా వ్యవహరించి, ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్ విమల దంపతులు కన్యా దాతగా వ్యవహరిస్తూ మానస కు తల్లిదండ్రులు లేని లోటును తీర్చారని, నిరుపేద యువతి మానస వివాహం కు స్థానిక ఎమ్మెల్యే విజయ రమణరావు, ఆదనపు కలెక్టర్ వేణు, పెద్దపల్లి డిసిపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సిఐ ప్రవీణ్ కుమార్, డి డబ్ల్యు ఓ. వేణుగోపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం దంపతులు, పిటి స్వామి, బాదే వెంకటేష్, లెనిన్, రమేష్, మరియు స్వచ్ఛందా సంస్థల ఐక్యవేదిక నిర్వహకులు గోలివాడ చంద్రకళ, ఆర్తి విజయ, రామ, జయహో జక్కిని శ్రీలత, హెల్పింగ్ హాండ్స్ శ్యామ్, జిల్లా వివిధ శాఖ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జర్నలిస్టు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినందుకు ఆయన ఒక ప్రకటన లో పేరు పేరున దినేష్ ధన్యవాదాలు తెలిపారు.

## త్వరలోనే అన్ని సౌకర్యాలతో కూరగాయల మార్కెట్ పనులు ప్రారంభం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే–21: పెద్దపల్లి పట్టణంలోని జండా చౌరస్తా వద్ద గల కూరగాయల మార్కెట్ ను అన్ని సౌకర్యాలతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం రోజు ఉదయం జెండా చౌరస్తా వద్ద గల కూరగాయల మార్కెట్ ను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మరియు మున్సిపల్ అధికారులు. హోల్ సెల్ మరియు రిటైల్ దుకాణ యజమానులతో సమావేశమై పనులకు సంబంధించిన మ్యాప్ ను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నాలుగు కోట్ల ఇరవై లక్షల రూపాయలతో నూతన కూరగాయల మార్కెట్ నిర్మించడం జరుగుతుంది అని కూరగాయల మార్కెట్ లోని హోల్ సెల్,రిటైల్,మటన్,చికెన్ మరియు చేపల వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నూతన సౌకర్యాలతో నూతన మార్కెట్ నిర్మిస్తామని అందుకు సంబంధించిన టెండర్ కూడా 15 నుండి 20 రోజులోపల పిలవడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప. మున్సిపల్ ఏఈ సతీష్,టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్,కిరణ్,వార్డ్ ఆఫీసర్లు,మున్సిపల్ సిబ్బంది మాజీ కౌన్సిలర్లు మరియు నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

పతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఉట్కూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీస్ స్టేషన్ ఆవరణలో 5%o% అమలు తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరలు, స్టేషన్ రికార్డ్స్, పెండింగ్ ఫైల్స్ మరియు రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ గ్రామాలను తరుచూగా సందర్శించాలన్నారు. పాత నేరస్థుల పై రౌడి షీటర్స్ పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టీ పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. స్టేషన్ పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.ప్రతి రోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలోఎస్పీ తో పాటు మక్తల్ సీఐ రామ్ లాల్, ఉట్కూర్ ఎస్సై కృష్ణంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే-21: గ్రామీణ అభివృద్ధిలో ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామీణాభివృద్ధి శాఖ పై సంబంధిత అధికారులతో .జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష. రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ. గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని. అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద కూలీల సంఖ్య పెంచెందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చిన్న నీటిపారుదలు. లిఫ్ట్ ఇరిగేషన్. చెరువులు. ఎస్సారెస్పీ క్రింద ఉన్న వివిధ కాల్వల్లో మరమ్మత్తు పనులు గుర్తించి చేపట్టాలని. కాలువలలో నీటి ప్రవాహకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తిస్థాయిలో సిల్ట్. చెత్త. పిచ్చి మొక్కలు తొలగింపు వంటి పనులు ఉపాధి హామీ క్రింద చేపట్టాలని కలెక్టర్ సూచించారు.యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లబ్ధిదారులకు జూన్ రెండు నాటికి స్వయం ఉపాధి యూనిట్ మంజూరు పత్రం పంపిణీ చేసే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పారదర్శకంగా అర్హుల జాబితా ఎంపిక చేయాలని. జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో తుది జాబితా తయారు చేయాలని అన్నారు. స్వయం ఉపాధి యూనిట్ గ్రౌండింగ్ కు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని. జడ్పీ సీఈఓ నరేందర్. ఎంపిడిఓ లు. సంబంధిత అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

## క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందం




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే -21: క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అభినందిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 4 సంవత్సరాలుగా గర్భ సంచిలో గడ్డ తో ఇబ్బంది పడుతున్న మైనారిటీ మహిళకు. నేడు రక్తహినత మరియు ఫిట్స్ ఉన్న విజయవంతంగా డాక్టర్ అనసూయ, డాక్టర్ శ్రీధర్ డా షౌరయ్య నిర్వహించారని ఆయన తెలిపారు.ఇలాంటి శాస్త్ర చికిత్సలు పెద్దపల్లి మాత శిశు హాస్పిటల్ లో నిర్వహిస్తున్నామని ,అవసరం ఉన్న ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు. వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని. అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో కోరారు.

## భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే- 21: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ బుధవారం నాడు కొత్తపల్లిలో ఉన్న భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ పోలీస్ శాఖ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో గత డిసెంబరులో ప్రారంభమైన ఈ కేంద్రం సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భరోసా కేంద్రంలోని సిబ్బందితో కమిషనర్ మాట్లాడారు. కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించిన ఆయన, అవి సక్రమంగా నిర్వహించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. అలాగే. కేంద్రం ద్వారా బాధితులకు అందుతున్న సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసులపై దృష్టి సారించిన ఆయన. నిందితులకు శిక్షలు పడేలా నిర్దేశిత విధంగా కృషి చేయాలని. బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ. లైంగిక వేధింపులకు గురైన మహిళలు. అసభ్యకరమైన ప్రవర్తనకు గురైన పిల్లలు పోలీస్ స్టేషన్లు లేదా ఆసుపత్రులకు వెళ్లి ఇబ్బంది పడకుండా. సురక్షిత వాతావరణంలో సహాయం పొందేందుకు భరోసా కేంద్రాలు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయబడ్డాయి అని పేర్కొన్నారు. భరోసా కేంద్రాల స్థాపన తర్వాత లైంగిక వేధింపుల కేసుల్లో శిక్షల శాతం పెరిగిందని. బాధితులకు తక్షణమే న్యాయం అందించే దిశగా ఇది కీలకంగా పనిచేస్తోందని వెల్లడించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఏసీపీ మాధవి. ఇన్‌స్పెక్టర్ శ్రీలత. ఎస్సై అనూష తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



సంస్థాన్ నారాయణపూర్, మే 21 శుభోదయం న్యూస్: భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరెంటోతూ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ టెలి కమ్యూనికేషన్ విప్లవంతో దేశాన్ని 21 శతాబ్దంలోకి తీసుకెళ్లిన ధార్మినీకుడు రాజీవ్ గాంధీ అని అతి చిన్న వయసులో ప్రధానమంత్రి అయిన వ్యక్తి రాజీవ్ గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆధునీకరణ, ఉదారీకరణలపై దృష్టి సారించింది. కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాలలో అతను అనేక



ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజీవ్ గాంధీని భారతదేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవం యొక్క ఘనత అతనికే చెందుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్, ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి, మందు గుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, నోముల మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, రాస మల్ల యాదయ్య, బిక్షపతి నాయక్, అక్బర్ అలీ, నయీమ్ షరీఫ్, రహీమ్ షరీఫ్, గణం అంజయ్య, కుక్కల నరసింహ, లోడే రఘు, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, చిలువేరు అంజయ్య, రాచకొండ రమేష్ బాబు, పగిళ్ల శేఖర్, వీరమల్ల స్వామి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రమేష్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు ఉప్పల నాగరాజు, అంతటి స్వామి గౌడ్,కొండ నవీన్ గౌడ్, చిలువేరు శంకర్, రేవన పెల్లి గోపాల్, బద్దుల యాదగిరి యాదవ్, ఈసం శివకుమార్, రాస మల్ల వీరస్వామి, గంగాన బోయిన బాలకృష్ణ, అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్)మే 21:సికింద్రాబాద్ కారా?నా న్యూ వాసవి నగర్ లో నూతనంగా ప్రారంభించిన ఉమెన్ కేర్, పాలి క్లినిక్ లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, తిరుమలగిరి ఏసిపి రమేష్ లు ప్రారంభించారు.. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వైద్యులు ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నడం పట్ల ఈటల రాజేందర్ అభినందించారు... ఆస్పత్రి నిర్వహకులు డాక్టర్ సుప్రియ మరిపల్లి ఆనంద్ మరిపల్లి సారథ్యంలో కారా?నాలో ఉమెన్స్ కేర్ ఆస్పత్రిని నెలకొల్పారు.. మహిళల కొరకు ప్రత్యేకంగా ఆసుపత్రిని లో అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డాక్టర్ సుప్రియ తెలిపారు.. కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, బిజెపి రాష్ట్ర నాయకుడు బానుక నర్మద మల్లికార్జున్, సామాజిక కార్యకర్త సతీష్ కుమార్ గుప్తా, తోపాటు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు.

## దళిత యువకుడు పై వేధింపులు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్), మే 21: దారమల్ల సందీప్ నేరం అంగీకరించిన తిరుమల పాలెం ఎస్ఐ జగదీష్ 13 రోజులుగా చిత్రహింసలు పెట్టి దళితుడు అనే కారణంగా చిత్రహింసలు గురైన సందీప్ పురుగు మందు తాగి పోలీస్ స్టేషన్లో ఆత్మహత్య చేసుకున్నాడు ఈరోజు ఖమ్మం నగరంలో చర్చి కంపౌండ్ ఓ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న దారమల్ల సందీప్ (తండ్రి) తిరపయ్య లను పరమశించిన కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఎర్రగడ్డ గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన బెల్లం అభినాష్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎస్ఐ జితేందర్ ని తక్షణమే సస్పెండ్ చేసి చట్టపరమైన విచారణ జరిపించాలని తెలంగాణ మాదిగ కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన దారమల్ల సందీప్ ( తండ్రి) తిరపయ్య కుటుంబానికి న్యాయం చేయాలని లేనిపక్షంలో దశలవారి ఆందోళన చేస్తామని ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు దుపెల్లి శ్రీను మాదిగ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిశాల వెంకన్న మాదిగ పాలేరు నియోజకవర్గ నాయకులు జంగం వెంకయ్య మాదిగ పోలిపొంగు వెంకటేశ్వర్లు గద్దల వెంకన్న తదితరులు పాల్గొని సందీప్ కుటుంబానికి న్యాయం చేయాలని తెలిపారు.

## బొడ్రాయి ప్రతిష్టాపనలో పాల్గొన్న పట్నం అవినాష్ రెడ్డి

షాబాద్ : షాబాద్ మండలంలోని నాందార్ ఖాన్ పేట్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మాజీ జడ్పీటీసి పట్నం అవినాష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు అవినాష్ రెడ్డి ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ పొన్న వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు వెళ్లే రహదారుల ప్రక్కన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.... సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్..

):మండల పరిధిలోని బిజ్వార్ గ్రామం నుంచి అటు పెద్ద జట్రం గేటు ఇటు ధన్వాడకు వెళ్లే రహదారులకు సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రయాణికులు ఇక్కట్లను తొలగించాలని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ రహదారి గుండా నిరంతరం వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయని కొత్తగా వచ్చినవారు ఏ రహదారిపై వెళ్లాలో అర్థం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు ఈ ప్రదేశాన్ని గుర్తించి ప్రయాణికుల సౌకర్యార్థం సూచిక బోర్డు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## సి ఎం ఆర్ ఎఫ్ ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన భీమ్ భరత్

):మొయినాబాద్ : బుధవారం రోజ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి (సిఎంఆర్ఎఫ్) సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను లబ్ధి దారులకి చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ లబ్ధిదారులకు అందజేశారు. చేవెళ్ళ , శంకర్ పల్లి , నవాబ్ పెట్ , మొయినాబాద్ , షాబాద్ మండలాలకు సంబంధించిన 42 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. మొత్తం రూపాయలు 20,59,000/ ఇరవై లక్షల యాభై తొమ్మిది వేల రూపాయలు ఈ సందర్భంగా వారు మాట్లడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయం పేదల వరం అని తెలిపారు . మరియు వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు యేటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య , నవాబ్ పెట్ మండల అధ్యక్షులు వెంకటయ్య , కాంగ్రెస్ పార్టీ విల్లెజ్ అధ్యక్షుడు బుర్ర కాయల రమేష్, పైలు ధనరాజ్, రాజు గౌడ్, బైకెని కుమార్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట రెడ్డి ,షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య , చేవెళ్ళ నియోజక వర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా ప్రెసిడెంట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులు , మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఎన్ ఎస్ యు ఐ మరియు ఇతర అనుబంధ అధ్యక్షులు, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు డైరెక్టర్లు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు జడ్పిటిసిలు మాజీ ప్రజా ప్రతినిధులు , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

తొట్టంబేడు మే 21 (ఆర్టిఐ ఎక్స్ ప్రెస్ న్యూస్) :శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని తొట్టంబేడు మండల అధ్యక్షుడిగా రావెళ్ల మునిరాజు నాయుడు నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మునిరాజా నాయుడు ను విలేకరులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తొట్టంబేడు మండలాధ్యక్షుడు మునిరాజ నాయుడు మాట్లాడుతూ స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఉన్నప్పుడు నుండి ఆయనతోపాటు పని చేశానని ఆయన నీతి నిజాయితీతో కూడిన రాజకీయం చేశాడని దగ్గరుండి చూశానని అన్నారు. మండలంలో శాంతిభద్రతలకు ఎక్కడ భంగం కలగకుండా చూస్తానన్నారు. అదేవిధంగా అవినీతికి తమ పార్టీ వారైనా పాల్పడితే ఎవరిని క్షమించేది లేదని అన్నారు. మండలంలో అధికారులు పనితీరు బాగుందని ఒకరు ఇద్దరు అధికారులు పై తమకు ఆరోపణలు కూడా వస్తున్నాయని వాటిని కూడా సరి చేసే విధంగా చూస్తామని అన్నారు. మండలంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి దక్కే విధంగా కృషి చేస్తామన్నారు. తొట్టంబేడు మండలం టిడిపి పార్టీకి కంచుకోట అన్నారు. టిడిపి పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి సముచిత స్థానాన్ని కల్పించే విధంగా చూస్తామన్నారు. తొట్టంబేడు మండలంలో ప్రస్తుతం ఏవైతే అభివృద్ధి పనులు జరగాల్సి ఉన్నాయో వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటిని పూర్తి చేసే విధంగా చూస్తామన్నారు. బొజ్జల ఎటువంటి రాజకీయం చేశారో అదేవిధంగా చేస్తామని అన్నారు. తొట్టెంబరు మండలంలో ఏపీ ఐఐసి భూములు తీసుకుని పరిశ్రమలు కూడా నెలకొల్పడం జరుగుతుందని అన్నారు. తొట్టంబేడు మండలం పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నిరుద్యోగులకు పరిశ్రమల్లో ఎమ్మెల్యే చొరవతో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఇస్తామన్నారు. మండలంలోని తెలుగుదేశం పార్టీలో ఉన్న అన్ని కులాలకు చెందిన నాయకులను సమన్వయం చేసుకుంటూ ఎక్కడ ఇటువంటి మనస్థాపాలు లేకుండా అందరిని కలుపుకొని పోతానని చెప్పారు. తొట్టంబేడు మండలంలోని ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే తో మాట్లాడి పరిష్కరించే విధంగా చూస్తామని తెలియజేశారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి తెలుగుదేశం పార్టీకి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు.

## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

:శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం ఈరోజు శ్రీకాళహస్తికి విచ్చేసిన జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గారికి స్వాగతం పలికిన జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి.అనంతరం స్వామివారి ప్రత్యేక దర్శనంజరిపించి,తీర్థప్రసాదాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దండి రాఘవయ్య ,కుమార్,చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

శనార్తి తెలంగాణ తలకొండపల్లి రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల కేంద్రంలో దివంగత నేత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ అవరానలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి,పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి డి. మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు అంజయ్య గుప్తా, ఎం.డి.అజీమ్, గ్రామ అధ్యక్షులు పేరుమాండ్ల రమేష్,మాజీ ఎంపిటిసి రాములు, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీల అధ్యక్షులు ఎండి ఆరిఫ్, నాయకులు బోల యాదగిరి తుమ్మ నరసింహ, నరసింహారెడ్డి,, పెంటయ్య, వెంకటేష్, పోతగంటిగణేష్, మీసేవమల్లేష్, రాజేందర్, నూకం శేఖర్, దేశ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బీబీకే క్రీడా పోటీలు ...

:జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని భీం రాజ్ పల్లి గ్రామం లో బీబీకే ( భీం రాజ్ పల్లి బొమ్మన కుమార్) ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన ముగ్గులు, కబడ్డీ, కోకో పోటీలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతి విజేత లు గా గుండేటి మైత్రి, కల్లెం సంధ్యారెడ్డి, ముంజ శ్రీహిత గెలుపొందారు. కబడ్డీ పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు దూస వర్షిత, కల్లెం సంధ్యారెడ్డి, జూనియర్స్ లో మల్లిక, ధన్య శ్రీ, గెలుపొందారు, పాటల పోటీల్లో రేవల్లె గంగ భవాని, ధన్య శ్రీ, శ్రావణి, గెలుపొందారు. అలాగే కోకో పోటీల్లో పలువురు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా బిబికె ఫౌండర్ బొమ్మెన కుమార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను బి బి కే ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. క్రీడలు శారీరిక దారుఢ్యానికి, మానసికొల్లోసానికి దోహదం చేస్థాయన్నారు.ఇక పై ప్రతి సీజన్లో యువతకు,మహిళల క్రీడాకారులకు బి బి కే ఆటల పోటీలు నిర్వహించనుందని బొమ్మెన కుమార్ ప్రకటించారు. బీబీకే ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో విజయం సాధించిన యువత జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కాంక్షించారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## యువజన బానుడు రాజీవుడు- రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ఇంచార్జ్ ఎం రాధాకృష్ణ

ప్రపంచంలో ఏ దేశంలో లేని యువ శక్తి భారతదేశంలో ఉందని, దేశ భవిష్యత్తు యువత భవిత మీదే ఆధారపడి ఉందని గ్రహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాలలో శాశ్వత వెలుగులు నింపిన యువజన భానుడు మన రాజీవుడని రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి గోవిందు శంకర శ్రీనివాసన్ అన్నారు. భారతదేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు చూపించడం కోసం కృషిచేసిన రాజనీతిజ్ఞుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ గారి వర్ధంతి కార్యక్రమం చిలకలూరిపేట కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు రాజీవ్ గాంధి చిత్రపటానికి పూలు, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ అద్దంకి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి దేశ ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తే నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పరిపాలన కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవ్వకుండా యువత భవితను నిర్వీర్యం చేశారని విమర్శించారు.

## పవన్ కళ్యాణ్ కొత్త కార్యక్రమం.. ప్రజా సమస్యలకు అక్కడే పరిష్కారం!





**అమరావతి,:** సినీ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన పవన్ కళ్యాణ్.. రాజకీయాల్లో సైతం తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పవన్ పరపతి బాగానే పెరిగింది. అంతేకాదు వినూత్న కార్యక్రమాలతో ముందుకు దూసుకెళ్తున్నారు. ఇప్పటికే పల్లె పండగ, అడవి తల్లిబాట కార్యక్రమాలు నిర్వహించిన జనసేన అధ్యక్షుడు పవన్.. ఇప్పుడు మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'మన ఊరి కోసం మాటామంతీ' పేరుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, సరాసరి కలిసేందుకు సమయం కుదరని పరిస్థితుల్లో డిప్యుటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక ఊరితో ఒకరోజు మాట్లాడేలా ఈ కార్యక్రమం డిజైన్ చేసారు. ఈ కార్యక్రమంలో సమస్యలకు దాదాపు అక్కడే పరిష్కారం దొరికేలా చేస్తారు. రేపు మొట్టమొదటిగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలోని రావివలసలో మన ఊరి కోసం మాటామంతీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మంగళగిరి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యుటీ సీఎం పవన్ పాల్గొంటారు. రావివలస గ్రామంలో స్క్రీన్ ఏర్పాటు చేసి వారితో మాట్లాడాలని ముందుగా అనుకున్నా.. ఓవైపు ఎండ, మరోవైపు వర్షాల కారణంగా టెక్కలిలోని భవానీ థియేటర్‌ను వేదికగా ఎంచుకున్నారు. మంగళగిరిలో తన కార్యాలయం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా గ్రామస్థులతో మాట్లాడతారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్సులో పాల్గొననున్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలపై జనసేనాని ప్రధానంగా దృష్టి పెట్టారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

## వర్షాలు పడుతున్నాయి, అప్రమత్తంగా ఉండండి.. అధికారులకు సీఎం ఆదేశాలు..!




**హైదరాబాద్, :** హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ ను ఆదేశించారు. ఇక వాతావరణశాఖ ప్రకారం మరో రెండు రోజులు వర్షాలు పడతాయన్న కారణం చేత సీఎం అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

## కార్యకర్తల బాధ్యత నాది, పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్ద కొడుకులా అండగా ఉంటా!



**అమరావతి,:** ఇకపై కార్యకర్తల బాధ్యత తనదే అని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటానని చెప్పారు. టీడీపీకి కార్యకర్తలే బలమని, ఇకపై కార్యకర్తలను నేరుగా కలుసుకోవాలని మంత్రి నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటి రెడ్డి కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని వారితో లోకేష్ భేటీ అయ్యారు. వెన్నా బాలకోటి రెడ్డి నాలుగు దశాబ్దాలుగా పార్టీ పటిష్టత, ప్రజా సంక్షేమ కోసం పనిచేశారని మంత్రి నారా లోకేష్ అన్నారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అండతో బాలకోటి రెడ్డిని కొందరు తుపాకీతో కాల్చి చంపారని ఫైర్ అయ్యారు. హత్యకు ఆరు నెలల ముందు కత్తులతో దాడికి యత్నించగా బాలకోటి రెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని, రక్షణ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. బాలకోటి రెడ్డి హత్య కేసులో నిందితులకు శిక్ష తప్పదని మంత్రి లోకేష్ హెచ్చరించారు. బాలకోటి రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## నోరు అదుపులో పెట్టుకో.. కేటీఆర్ పై ఐలయ్య ఫైర్..!



**హైదరాబాద్, :** ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత పిచ్చెక్కినట్లుగా ప్రవర్తిస్తున్నాడని ఆయన ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి గురించి అవాక్కులు, చావాక్కులు మాట్లాడటం తగదన్నారు. అంతే కాకుండా అయన మాట్లాడుతూ.. కేటీఆర్ తన నోరును అదుపులో పెట్టుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేసారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రులు అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగు నీటి ప్రాజెక్టుల పరంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ముందుండి వాటిని నడిపిస్తున్నారు. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లాలో రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలి కులేశ్వరం గా మారిందని ఎద్దేవా చేసారు. ఈసారి కాళేశ్వరం లేకపోయినా రికార్డు స్థాయిలో పంట పండింది. ఇది మీ కళ్ళకి కనిపించడం లేదా? నల్గొండ జిల్లా మా హయాంలో అన్నం పెట్టే జిల్లాగా మారింది. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులను సీఎం రేవంత్ రెడ్డి సరిదిద్దుతున్నారని అన్నారు. స్కాంల చరిత్ర ఆ పార్టీదే అని బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసారు. ఇక వేయి ఎలుకలు తినిన పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా కేసీఆర్ ప్రవర్తిస్తున్నాడని.. కేటీఆర్ మా సీఎంపై నోరు జారితే, నోటిని యాసిడ్‌తో కడుగుతాం.. జాగ్రత్తగా ఉండాలని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## సూర్యుడిపైకి సాగర మేఘాలు

- 'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్'తో సూర్యరశ్మి వెనక్కు!
- సముద్ర మేఘాల్లోకి జల శతఘ్నుల ప్రయోగం
- చిక్కబడిన మేఘాలతో సూర్య 'శౌర్యం' తిరుగుముఖం
- భూతాపాన్ని తగ్గించేందుకు జియో ఇంజనీరింగ్ వ్యూహం
- ఐదేళ్లలో ప్రయోగాలు
- సక్సెస్ అయితే భూగ్రహం ఇక చల్లని గృహమే!




స్పెషల్ డెస్క్- ఇది కూడా యుద్ధం వంటిదే! అయితే దేశాల మధ్య యుద్ధం కాదు. శాస్త్ర పరిశోధకులు సూర్యుడిని మసకబార్చి భూమిని చల్లబరిచేందుకు చేయబోతున్న మహా ప్రయోగ సంగ్రామం! ఈ జాజ్వల్యమాన జల వ్యూహంలో సముద్రతలం నుంచి నౌకలు, గగనతలం నుంచి విమానాలు ఉప్పు నీటి శతఘ్నులను సంధించి, తమ చెయ్యెత్తులో ఉన్న సాగర మేఘాలను చిక్కబరిచి వాటిని దట్టంగా మార్చేస్తాయి. ఆ బాహుబలి మేఘాలు, సూర్యుడి నుంచి వచ్చే తీక్షణమైన కిరణాలను అడ్డుకుని, వాటిని తిరిగి వెనక్కు అంతరిక్షంలోకి పంపిస్తాయి! వేడిమి నుంచి భూమిని కాపాడతాయి. మహోష్ణ గోళంతో మనిషి తలపడనున్న ఈ ఆపరేషనే 'ఎంసీబీ'. మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్! మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ అనేది ఒక జియో ఇంజనీరింగ్ టెక్నిక్. భూతాపాన్ని అరికట్టే ప్రయత్నంలో, భూ వాతావరణాన్ని ప్రభావితం చేసే పర్యావరణ ప్రక్రియలను పెద్ద ఎత్తున మార్చడమే జియో ఇంజనీరింగ్. ప్రపంచవ్యాప్తంగా, మహా సముద్రాలపై సూర్యరశ్మిని వెనక్కు పంపించేలా వాతావరణంలోకి కృత్రిమ రసాయన వాయు కణాలను చొప్పించటం, భూతాప నియంత్రణకు సముద్రపు నీటిలో కరిగి ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ను పీల్చి పారేయటం వంటి అత్యంత క్లిష్టమైన ప్రాజెక్టుల వంటి అన్నీ జియో ఇంజనీరింగ్ వ్యూహంలో భాగమే.

### ఎంసీబీ ప్రయోగాన్ని ఎలా చేస్తారు?

వాతావరణంలోకి ఉప్పు నీటిని 'ఎగచిమ్మటం' ద్వారా సముద్ర మేఘాలను కృత్రిమంగా అత్యంత ప్రకాశవంతం చేయటమే మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్. దీనివల్ల ఏర్పడే ఉప్పు నీటి వాయు బిందువులు సముద్ర మేఘాల సాంద్రతను పెంచుతాయి. ఆ మేఘాలను ఢీకొని సూర్యరశ్మి వెనక్కు (పైకి) మళ్లుతుంది. దాంతో భూమి సంగ్రహించే ఉష్ణోగ్రత తగ్గి, భూతాప నివారణ జరుగుతుంది. సముద్రపు మేఘాలు సహజంగా మహాసముద్రాలపై ఏర్పడతాయి. అందుకు సముద్రపు ఉప్పు కీలకమైన పదార్థంగా పనిచేస్తుంది. సముద్రపు ఉప్పు కణాలు గాలి ద్వారా కదిలినప్పుడు అవి మేఘ బిందువులకు కేంద్రకాలుగా మారి, నీటి ఆవిరి వాటిపై ఘనీభవిస్తుంది. ఈ మేఘ బిందువుల సంఖ్య, పరిమాణం ఒక మేఘం ఎంత సూర్యరశ్మిని తిప్పి కొడుతుందో నిర్ణయిస్తాయి. ఇదంతా సహజ ప్రక్రియ. మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ విధానంలో సముద్ర మేఘాలకు మరిన్ని సముద్రపు ఉప్పు కణాలను జోడించడం ద్వారా ఈ సహజ ప్రక్రియను అనుకరించడం, మెరుగుపరచడం జరుగుతుంది. మెరైన్ స్నో మెషీన్లను, ప్రత్యేకమైన నాళాల వంటి పరికరాలను ఉపయోగించి సముద్రపు ఉప్పు నీటిని గాలిలోకి చల్లడం ద్వారా ఈ ప్రయోగం చేస్తారు.

### 35 ఏళ్ల ప్రయత్నాలు.. 5ఏళ్లలో ప్రయోగాలు!

1990లలో తొలిసారి బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్త జాన్ లాథమ్‌కు ఈ 'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్' ఆలోచన వచ్చింది. ప్రయోగాలకు అనుకూలమైన సముద్ర ప్రాంతాలపై మేఘాలను ప్రకాశవంతం చేయడం వల్ల భూతాపాన్ని పెరగకుండా చేయవచ్చని ఆయన తలపోశారు. ఎలాగంటే... ప్రత్యేక స్ప్రేయర్‌లతో వాతావరణంలోకి చిన్నపాటి సముద్రపు నీటి బిందువులను ఎగజిమ్ముతారు. ఇవి ఆవిరైపోయి ఉప్పు కణాలను మిగులుస్తాయి. ఆ కణాలు దట్టమైన, ప్రకాశవంతమైన మేఘాలను సృష్టిస్తాయి. అవి సూర్యరశ్మిని అడ్డుకుని భూమి మీద వాటి తీవ్రతను తగ్గిస్తాయి. ఇదీ జాన్ లాథమ్ ఆలోచన. ఇన్నేళ్లకు ఈ ఆలోచన ప్రయోగ దశకు చేరుకుంది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రయోగం ఆచరణలోకి రావచ్చని ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూరుస్తున్న 'ఆరియా' అనే బ్రిటన్ సంస్థ అంచనా వేస్తోంది.

### రహస్య పరిశోధనా సంస్థ 'ఆరియా'

భూతాప వేగాన్ని నెమ్మదిపరిచే లక్ష్యంతో అనేకమైన జియో ఇంజనీరింగ్ ప్రాజెక్టు పనులు చేపట్టటానికి 'అరియా' అడ్వాన్స్డ్ రీసెర్చ్ ఇన్వెషన్ ఏజెన్సీ' ఏర్పాటైంది. ఇందుకోసం ఈ ప్రభుత్వ రహస్య పరిశోధనా సంస్థ ఇంతవరకు ప్రజా పన్నుల నుంచి 800 మిలియన్ పౌండ్లను సమకూర్చుకుంది. ఇందులో ఒక్క మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ ప్రాజెక్టుకే 57 మిలియన్ పౌండ్లను బ్రిటన్ ప్రభుత్వం కేటాయించింది. అనధికారికంగా 2021 ఫిబ్రవరిలో, అధికారికంగా 2023 జనవరిలో ఈ సంస్థ ప్రారంభం అయింది. ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే శాస్త్రీయ, సాంకేతిక పురోగతులను ఆవిష్కరించమే తన ధ్యేయం అని ఈ సంస్థ చెబుతోంది. "ఎంతో ఊహాజనితమైన, అతి కష్టతరమైన, వేరే చోట జరగటం అసంభవం అయిన పరిశోధనలను కొనసాగించడానికి మేము శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అధికారం ఇస్తాం" అని అరియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇలాన్ గుర్ అంటున్నారు.

### ఎంసీబీ ప్రయోజనాలు

మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ భూమి గ్రహించే సూర్యరశ్మి పరిమాణాన్ని తగ్గించి భూతాపాన్ని నివారిస్తుంది. భూగోళాన్ని చల్లబరిచి వేడిగాలులు లేకుండా, కరువు కాటకాలు రాకుండా చేయగలదు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను తగ్గించి, పగడపు దిబ్బలు క్షీణించకుండా కాపాడుతుంది.

### ఎంసీబీ దుష్ప్రభావాలు

వాతావరణ సమతౌల్యం, భూమికి నీటిని అందించే 'అవపాత చక్రం' (వర్షపు జల్లులు, మంచు, వడగళ్లు కురిసే కుదురైన వ్యవస్థ) దెబ్బతినే ప్రమాదం ఉంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రించే 'ఎల్ నినో' గతి తప్పవచ్చు. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలు నిష్ఫలం కావచ్చు.


## 'అఖిలపక్షం వేళ' అనైక్యత!




దేశం కోసం సమష్టిగా కదలాల్సిన సందర్భాల్లో సైతం కలవలేనంతగా అధికార విపక్షాలు ఎడ మొహం పెడమొహంగా మారాయి. పెహల్‌గామ్‌లో గత నెల 22న ఉగ్రవాదులు సాగించిన మారణ కాండ మొదలు మన ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్, ఈ నెల 10న కాల్పుల విరమణ, పాకిస్తాన్ దురాలోచనలూ వగైరా ప్రపంచానికి తెలియజెప్పేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల కూర్పు ప్రక్రియ వివాదాస్పదంగా మారటం దీన్ని చాటుతోంది. మన దేశంనుంచి సమష్టి స్వరం వినబడితే దాని ప్రభావం వేరుగా వుంటుంది. పాకిస్తాన్ సైతం ఇదే తరహాలో అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపటానికి సన్నాహాలు చేసుకుంటున్నది. కనీసం ఇందుకోసమైనా విభేదాలు పక్కనబెట్టి ఒక్కటై నిలబడదామన్న స్పృహ అటూ ఇటూ కరువవుతోంది. ఏ దేశంలోనూ ఇలా వుండదు. అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రం (డబ్ల్యూటీసీ)పై ఉగ్రదాడి మొదలు ఇందుకు ఎన్నయినా ఉదాహరణలివ్వొచ్చు. 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరుతో అమెరికా అఫ్గాన్‌ను వల్లకాడు చేసింది. చివరకు ఒరిగిందేమీ లేదు. అఫ్గాన్‌నుంచి అవమానకరంగా నిష్క్రమించాల్సి వచ్చింది. అయినా అక్కడి విపక్షం మౌనంగా ఉండిపోయింది. కానీ ఇక్కడలా కాదు. యూపీఏ హయాంలో ముంబైపై ఉగ్రదాడి, దానికి వెనకాముందూ జరిగిన అనేకానేక ఉదంతాల్లో మన దేశంలో అధికార పక్షంపై విపక్షం విరుచుకుపడటం, యక్షప్రశ్నలు వేసి ఇరుకున పడేసే ప్రయత్నం చేయటం రివాజుగా మారింది. యూపీఏ హయాంలో బీజేపీ విపక్షంలోవుండి ఏం చేసేదో, ఇప్పుడు కాంగ్రెస్ సైతం ఆ పనే చేస్తోంది. పుల్వామా ఉగ్రదాడి సమయంలో మరీ దారుణం. జవాన్ల త్యాగాలూ, వారు దెబ్బకు దెబ్బ తీసిన వైనమూ 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో చర్చనీయాంశంగా మారటం ఆశ్చర్యపరిచింది. ఈ ఉదంతాలను బీజేపీ తనకను కూలంగా మలుచుకునే ప్రయత్నం చేయగా, ప్రభుత్వ వైఫల్యంపై విపక్షం చాటింపు వేసింది. అయితే మన దేశంలోనూ ఒకప్పుడు అధికార, విపక్షాలు కలిసికట్టుగా పనిచేసిన ఉదంతాలు లేకపోలేదు. ఇందుకోసం ఎన్నడో 1971 నాటి భారత్-పాక్ యుద్ధం వరకూ పోనవసరం లేదు. 1994లో కశ్మీర్‌పై భారత్ వైఖరిని వివరించటానికి నాటి ప్రధాని పీవీ నరసింహారావు రూపొందించిన అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహించింది అప్పటి విపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి! పాతికేళ్ల క్రితం కార్గిల్ యుద్ధ సమయంలో నాటి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, కాంగ్రెస్‌తోసహా విపక్షాలూ దేశభద్రత కోసం కలిసికట్టుగా పనిచేశాయి. కానీ ఇప్పుడెందుకు పరస్పరం తప్పులు వెదుక్కొనే తాపత్రయాన్ని ప్రదర్శిస్తున్నట్టు? దేశంలో తక్షణం వచ్చే ఎన్నికలేమీ లేవు. అయినా పెహల్‌గామ్‌ను రాజకీయంగా వినియోగించుకోవటానికి అటూ ఇటూ పోటీపడుతున్నారు. త్రివిధ దళాల అధికార ప్రతినిధులు చెప్పేవరకూ ఆగకుండా ఇష్టానుసారం ఉన్నవీ లేనివీ ప్రచారం చేసి, విపక్షాలను పాకిస్తాన్ అనుకూలురుగా, దేశద్రోహులుగా చూపటానికి బీజేపీ శ్రేణులూ, సాను భూతిపరులూ చేయని ప్రయత్నం లేదు. తొలి ప్రధాని నెహ్రూ ఉదారంగా పాకిస్తాన్‌కు నదీజలాలు, భారీయెత్తున సొమ్ము కట్టబెట్టారని బీజేపీ నేతలు ఇంకా ఆరోపణలు గుప్పిస్తూనే వున్నారు. ఒకపక్క అఖిలపక్షాన్ని పంపుతూ మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? వీటిని ఎలా ఎదుర్కొనాలో తెలియక ఇష్టానుసారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చులకనవుతున్నారు. యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి... మనవైపు జరిగిన నష్టమెంత అంటూ రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇవి అడగకూడని ప్రశ్నలేమీ కాదు... కానీ అందుకు తగిన వేదికను ఎంచుకోవాలని కూడా ఆయనకు తోచదు. ఇంతకూ అఖిలపక్ష బృందాల కూర్పుపై ఇంత వివాదం ఎందుకొచ్చినట్టు? విపక్షాలను విశ్వా సంలోకి తీసుకుని, వారు పంపిన పేర్లనుంచి ఎంపికచేసే కనీస మర్యాద అధికార పక్షం పాటించివుంటే సమస్య తలెత్తేది కాదు. విపక్షానికి ఆలోచించే శక్తిసామర్థ్యాలు లేవన్నట్టు సర్కారు ప్రవర్తించింది. కాంగ్రెస్ పార్టీ నలుగురు సభ్యుల పేర్లు పంపితే వారిలో ఒక్కరినే ఎంపిక చేసింది. పోనీ సర్కారు ఎంచుకున్నది కూడా సమర్థుల్నే కదా అనే సర్దుబాటు ధోరణి కాంగ్రెస్‌కు లేదు. అసలు ఆ పార్టీ నుంచి వెళ్లిన జాబితాలో సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్, మనీష్ తివారీ తదితరుల పేర్లు ఎందుకు లేకుండా పోయినట్టు? సీనియర్ నేత ఖుర్షీద్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం తీరా ఆయన సీనియారి టీని కాదని జేడీ(యూ) నేత సంజయ్ ఝాకు సారథ్య బాధ్యతలు ఎందుకిచ్చినట్టు? సమష్టి స్వరం వినబడాల్సిన ఈ సమయంలో ఇన్ని లుకలుకలుండటం మంచిదేనా? ఇంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ చివరకు ఈ వివాదాన్ని పొడిగించదల్చుకోలేదని చేతులెత్తేసింది. కానీ ఎప్పుడూ వీరంగం వేసే అలవాటున్న తృణమూల్ మాత్రం ప్రభుత్వం ఎంపిక చేసిన సభ్యుణ్ణి తప్పుకోమని చెప్పింది. దాంతో ప్రభుత్వం తగ్గి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ సూచించిన నేతకు స్థానం కల్పించింది. అఖిలపక్షం పంపటంలోని ఉద్దేశమే సమష్టితత్వాన్ని, ఈ దేశ సంకల్పాన్ని, పాకిస్తాన్ కుయుక్తులను చాటడానికైనప్పుడు సభ్యుల ఎంపిక వివాదాస్పదం కాకుండా ప్రభుత్వం చూడాల్సింది. ఈమధ్య ఆపరేషన్ సిందూర్ మొదలుకొని పార్టీ వైఖరికి భిన్నంగా పలు ప్రకటనలిస్తూ సంచలనం సృష్టిస్తున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ ఎంపిక చేయకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన్ను ఏరికోరి ఎంపిక చేయటం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టడానికేనన్న విషయంలో ఎవరికీ సందేహం అక్కర్లేదు. ఏదేమైనా ఇలాంటి సంక్షోభ సమయాల్లో అవసరమైన సంయమనం, హుందాతనం ఇరువైపులా కనబడకపోవటం దురదృష్టకరం.

## అప్పుడు మనిషి జీవితం నాలుగేళ్లే!

తేనె.. ఎంత రుచికరమో అంత ఆరోగ్యదాయకం. ప్రతిరోజూ తగిన మోతాదులో తేనె ను తీసుకోవడం ద్వారా పలు అనారోగ్యాల బారి నుంచి బయటపడవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. భూమిమీద కష్టించే జీవుల జాబితాలో తేనెటీగలు ముందుంటాయి. ఒకవైపు పర్యావరణాన్ని కాపాడుతూ, మరోవైపు మనకు ఆరోగ్యాన్ని అందిస్తున్న తేనెటీగలకు సంబంధించిన చాలా విషయాలు మనకు తెలియదు. రాయల్ జియోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ లండన్ సైంటిస్టులు తెలిపిన వివరాల ప్రకారం భూమి మీద తేనెటీగలు లేకపోతే మనిషి జీవితం దుర్భరమవుతుంది. నేడు (మే 20) ప్రపంచ తేనేటీగల దినోత్సవం. ఈ సందర్భంగా తేనెటీగలు పర్యావరణానికి అందించే సాయాన్ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. భూమి మీద బతికే హక్కు మనిషికి ఎంత ఉందో, మిగతా జీవరాశులకూ అంతే ఉంది. అయితే మనిషి తన అవసరాల కోసం మిగిలిన జీవుల ఉనికికి ముప్పు వాటిల్లే పనులు చేస్తున్నాడు. జీవ వైవిధ్యం కరువైతే ప్రకృతిలో సమతుల్యత దెబ్బతింటుంది. చివరికి ఆ ప్రభావం మనిషి మీదే పడుతుంది. రాయల్ జియోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ లండన్ సైంటిస్టులు చెప్పినదాని ప్రకారం తేనెటీగలు లేని భూమి మీద మనిషి కేవలం నాలుగేళ్లు మాత్రమే బతకగలడు. మిగిలిన జీవులు కూడా దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుంటాయి. నాడు ప్రముఖ శాస్త్రవేత్త ఐన్ స్టీన్ కూడా 'తేనెటీగలు లేకపోతే మనిషి నాలుగేళ్ల కన్నా ఎక్కువ



కాలం జీవించడం కష్టం' అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల సంఖ్య అంతకంతకూ క్షీణిస్తోంది. దాదాపు 90 శాతం తేనెటీగలు ఇప్పటికే అంతరించిపోయాయి. ప్రస్తుతం పదిశాతం మాత్రమే మిగిలాయి. భవిష్యత్తులో తేనెటీగలను ల్యాబ్‌లలో ప్రత్యేకంగా పెంచుకోవావల్సిన పరిస్థితులు ఏర్పడేలా ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రపంచంలో పండించే 100 రకాల పంటలలో.. 90 రకాల పంటలు ఫలదీకరణం చెందాలంటే తేనెటీగలు ఎంతో అవసరం. దీని ప్రకారం చూస్తే, అధికశాతం శాతం వ్యవసాయం తేనెటీగల వల్లే జరుగుతోందని చెప్పుకోవచ్చు. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా సెల్ ఫోన్ వినియోగం మరింతగా పెరిగింది. సెల్ ఫోన్ సిగ్నల్స్ తేనెటీగలకు హాని కలిగిస్తున్నాయి. అవి తాము కట్టుకున్న గూడుకు వెళ్లే దారిని మర్చిపోయేలా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తేనెటీగలు మరణిస్తున్నాయని పలు పరిశోధనల్లో తేలింది. మన పర్యావరణ వ్యవస్థలను సజీవంగా ఉంచడంలో తేనెటీగలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉంది.

## అరాచక పాలన.. భయపెట్టి పాలించడం మూర?త్వం..!



**అమరావతి,:** ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్‌ల సమావేశంలో పాల్గొన్న పార్టీ సీనియర్ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.. రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందన్న ఆయన.. భయపెట్టి పాలన చేయాలనుకోవడం మూర?త్వం అన్నారు.. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవుచెప్పారు.. అసలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరగలేదని స్పష్టం చేశారు.. కట్టుకథలతో మద్యం కుంభకోణం జరిగిందని టీడీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.. ఇక, వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణమైన విషయం అన్నారు.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు ఆపడం దుర్మార్గం అని ఫైర్ అయ్యారు.. హంద్రీనీవా లైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. కాగా, ఏపీ ప్రభుత్వంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. మంగళవారం రోజు సంచలన వ్యాఖ్యలుచేసిన విషయం విదితమే.. ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూనే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.. ఇప్పుడు ఉన్న అధికారులు అన్యాయమైన పనులు చేస్తే.. రేపు మళ్లీ మన రోజు వస్తుంది.. ఇప్పుడు పేర్లు రాసిపెట్టుకొంది.. రిటైర్డ్ అయినా.. విదేశాలకు పారిపోయినా.. తీసుకొచ్చిన సినిమా చూపిస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ సంచలన ఆరోపణలు..

### సోనియా, రాహులే కీలకం!



**న్యూఢిల్లీ,:** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈడీ దూకుడు పెంచింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు గుప్పించింది. ఈ నేరంలో వీరు 142 కోట్ల రూపాయల లబ్ధి పొందారని పేర్కొనింది. ఈరోజు ఢిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ తరపు లాయర్ ఈ వాదనలు వినిపించారు. అయితే, నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో సోనియా, రాహుల్ గాంధీలకి గతంలో పలుమార్లు ఈడీ అధికారులు విచారణ చేశారు. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి నడిపించారన్న ఫిర్యాదులతో ఈడీ, సీబీఐ విచారణ చేపట్టింది. సీబీఐ దర్యాప్తు మధ్యలోనే నిలిచిపోయినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం ఇంకా కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబర్లో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు స్టార్ట్ చేసింది. కాగా, ఇందులో భాగంగా ఢిల్లీ, ముంబై, లక్నో భవనాలకు ఈడీ నోటీసులు అంటించినట్లు తెలిపింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని వెల్లడించింది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని చెప్పింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ కొనసాగుతుంది అన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. అందులో కాంగ్రెస్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను వెల్లడించింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేయగా.. దీనిపై తాజాగా విచారణ కొనసాగింది.

## తిరువూరు కౌన్సిలర్లను అభినందించిన వైఎస్ జగన్


**వైఎస్ జగన్‌ని కలిసిన తిరువూరు కౌన్సిలర్లు**

**తమపై టీడీపీ నేతల దాడి, దౌర్జన్యం వివరించిన కౌన్సిలర్లు**

**కూటమి సర్కార్ అరాచకాలను ధీటుగా ఎదుర్కొందామన్న వైఎస్ జగన్**

**చట్టపరంగా, న్యాయపరంగా పార్టీ అండగా ఉంటుంది**

**టీడీపీ నేతలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా నిలిచినందుకు అభినందనలు**



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరువూరు కౌన్సిలర్లు బుధవారం కలిశారు. తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా తమపై టీడీపీ నాయకుల దాడి, దౌర్జన్యం గురించి వైఎస్ జగన్‌కు కౌన్సిలర్లు వివరించారు. పోలీసులు, కూటమి నేతలు, టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన తీరును పార్టీ నేతలు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో మెజారిటీ లేకపోయినా బరితెగించి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను, దాష్టికాలను ధీటుగా ఎదుర్కొందామన్నారు. చట్టపరంగా, న్యాయపరంగా పార్టీ అండగా ఉంటుందన్న వైఎస్ జగన్.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా నిలిచినందుకు అభినందనలు తెలిపారు.

## కరోనా కేసుల్లో మరో కొత్త వేరియంట్..



**న్యూఢిల్లీ,:** కొవిడ్ మహమ్మారి పలు రకాలుగా రూపాంతరం చెందుతోంది. ఒక్కో వేరియంట్ ఒక్కో విధంగా ప్రజల ప్రాణాలను హరించి వేస్తోంది. చైనాలో ఇటీవల వెలుగులోకి వచ్చిన కరోనా కేసుల్లో మరో కొత్త వేరియంట్ బయటపడినట్లు తెలుస్తోంది. అక్కడ ఓ 8 ఏళ్ల చిన్నారి మృతితో ఈ కొత్తరకం వైరస్ గురించి ఆరోగ్య నిపుణులకు అర్థమైంది. చైనాలో ఓ 8 ఏళ్ల చిన్నారి కొవిడ్-19 వైరస్‌తో మృతి చెందింది. ఆ చిన్నారి మెదడులోకి కరోనా వైరస్ వెళ్లింది. దీంతో ఆ పాప చావుకు ముందు కోమాలోకి వెళ్లిపోయింది. అలా కొద్దిరోజులకు మృతి చెందింది. దీంతో ఇదో అరుదైన వేరియంట్ గా అక్కడి వైద్యులు అభిప్రాయపడుతున్నారు. వైద్యులు తెలిపిన ప్రకారం.. ఆ చిన్నారికి మొదట జ్వరం వచ్చింది. చర్మంపై దురదలు,కాళ్లు, చేతులపై దురదలు వచ్చాయి. తలనొప్పి తీవ్రంగా ఉంది. వాంతులు చేసుకుంది. వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమె బ్రెయిన్ లోకి కొవిడ్ వైరస్ వెళ్లినట్లు వైద్యులు ధృవీకరించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో పాటు ఆమె కాళ్లు చేతులు వంకర్లు తిరిగాయని వైద్యులు పేర్కొన్నారు. కొవిడ్-19 సోకడం వల్ల ఆమె అరుదైన బ్రెయిన్ డిసార్డర్ బారిన పడినట్లు తెలిపారు. చిన్నారికి చైనాలోని గువాంగ్ జో వుమెన్ అండ్ చిల్డ్రన్ మెడికల్ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడి వైద్యులు పరీక్షలు చేసి నిర్ధారించారు. ఎక్యూట్ నెక్రోటైజింగ్ ఎన్ సెఫలోపతి అనే బ్రెయిన్ డిజార్డర్ కారణంగా చిన్నారి కోమాలోకి వెళ్లినట్లు అభిప్రాయానికి వచ్చారు. కొవిడ్ 19 సోకడంతోనే ఈ బ్రెయిన్ డిజార్డర్ వచ్చినట్లు తెలిపారు. కొవిడ్ వైరస్ మెదడులోకి వెళ్లడం ద్వారా న్యూరో సంబంధిత సమస్యలు తలెత్తుతాయని వైద్యులు భావిస్తున్నారు. గువాంగ్ జో వుమెన్ అండ్ చిల్డ్రన్ మెడికల్ ఆస్పత్రి వైద్యులు.. ప్రస్తుతం చిన్నారులకు కొవిడ్ నుంచి రక్షణ అనే అంశంపై అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం అందుతోంది.


# పర్యాటకులను మైమరిపించే శిల్ప సౌందర్యం

**అద్భుత శిల్పాల మ్యూజియం**

**గత వైభవాన్ని చాటుతున్న అలంపూర్**

**పురావస్తు ప్రదర్శనశాల**

**అంతర్జాతీయ ప్రదర్శనలతో ఖ్యాతి**



అలంపూర్: అద్భుత శిల్పాల రమణీయం పురాతన శిల్ప సౌందర్యంలోనే కన్పిస్తుంది. పురాతన ఇతిహాసాలు, గాథలు, ప్రకృతి వింతలు, విశేషాలు, రాజరికపు గుర్తులు, సిరి సంపదలు, మనుషుల వేషధారణ, సంప్రదాయం వంటి అనేక అంశాలను శిల్పులు తమ శిల్ప కళ ద్వారా భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేశారు. పురాతన చరిత్ర కలిగిన ప్రాంతాల్లో ఇలాంటి శిల్ప సంపదలు దర్శనమిస్తాయి. పురాతన ఇతిహాసాలకు, శిల్ప సౌందర్య కళకు అలంపూర్ పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది. ఇక్కడ వెలసిన పురాతన ఆలయాల్లో శిల్పుల కళానైపుణ్యం పర్యాటకుల మనసులను రంజింపజేస్తాయి. అక్కడక్కడ కనిపించే శిల్పాలే పర్యాటకుల మనసులను ఆహ్లాదపరిస్తే.. అబ్బురపరిచే శిల్ప సమూహం ఒకే చోట కనిపిస్తే శిల్పాకళా ప్రేమికుల ఉల్లాసానికి అవధులుండవు. అలాంటి అద్భుత శిల్పాల సమూహం అలంపూర్ క్షేత్రం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ ప్రాంతంలో లభించిన పురాతన, అరుదైన శిల్పాలను పురావస్తు శాఖ ఒక చోట భద్రపరిచింది. అదే పురాతన శిల్పాల ప్రదర్శన క్షేత్రం. పురావస్తు మ్యూజియంగా ఏర్పాటుచేసి పర్యాటకుల సందర్శనకు అందుబాటులో ఉంచారు.

### 1952లో ప్రారంభం..

అలంపూర్‌లోని పురావస్తు ప్రదర్శనశాలను 1952లో ప్రారంభించారు. ఆలయాల పరిసర ప్రాంతాలతో పాటు సమీప గ్రామాల్లో లభించిన శిలా శాసనాలు, విగ్రహాలు అన్నింటినీ సేకరించి సిద్ధుల మఠంగా పిలవబడే మండపంలో మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఇందులో 26 శిలా శాసనాలు, 188 శిలా విగ్రహాలు ఉన్నాయి. క్షేత్రానికి వచ్చే పర్యాటకులు మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పించారు.

### మ్యూజియంలో విశేషం ఇది..

ఉత్తరవాహిని తుంగభద్ర నదీ తీరాన వెలసిన అలంపూర్ క్షేత్రం ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతోంది. దేశంలో ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీజోగుళాంబ అమ్మవారి ఐదవ శక్తి పీఠం ఇక్కడ ఉంది. కోటి లింగాల క్షేత్రంగా అలంపూర్ ప్రసిద్ధిగాంచి.. దక్షిణకాశీగా పిలవబడుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠంగల క్షేత్రంగా ఖ్యాతి దక్కించుకుంది. ఇక్కడ ఉన్న ఆలయాల్లో ప్రాచీన శిల్పకళకు అద్దంపట్టే శిల్పాలు పర్యాటకులను ఉల్లాసపరుస్తాయి. ఈ క్షేత్రంలో మరో అద్భుతమైన ప్రదేశం పురావస్తు ప్రదర్శనశాల. 6వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం వరకు రాజుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వారిచే ఆరాధించబడిన దేవతా మూర్తుల విగ్రహాలు ఇక్కడ కొలువుదీరాయి. 6వ శతాబ్దంలోని బాదామి చాళుక్యుల కళాసంస్కృతికి ఇక్కడ వెలసిన శిల్పాలు నిదర్శనంగా ఉన్నాయి. 1500 ఏళ్ల క్రితం అలంకారానికి ఉపయోగించిన ఆభరణాలు, అప్పటి మహిళల వేషధారణ ఇక్కడి విగ్రహాలలో చూడవచ్చు. ఈ ప్రదర్శన శాలలో వీరాంగవీరులు (భర్త, భార్య ఇద్దరూ శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన వారు), వీరుగల్లు, వీరశిలా విగ్రహాలు, వారి బల ప్రదర్శనలు నేటికీ స్పష్టంగా కనిపిస్తాయి. సతీ సహగమనానికి సంబంధించిన విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్శణగా నిలుస్తున్నాయి.

### అంతర్జాతీయ ఖ్యాతి..

అలంపూర్‌లో లభ్యమై పురావస్తు మ్యూజియంలో భద్రపరిచిన శిల్పాలు దేశ విదేశాల్లో ఖ్యాతిని తెచ్చిపెడుతున్నాయి. ఇక్కడ ఏర్పాటుచేసిన శిల్పాలు కేవలం సందర్శనలకే గాక ప్రపంచ పురావస్తు శిల్పాల ప్రదర్శనలకు వెళ్లి అరుదైన గౌరవాలను దక్కించుకున్నాయి. 1977లో ఇక్కడి నటరాజ మూర్తి విగ్రహాన్ని లండన్‌లో ప్రదర్శించడం జరిగింది. అలాగే 1984లో సూర్య విగ్రహాన్ని జర్మనీలో, 2008లో సూర్య, నాగ, మహిషాసురమర్ధిని విగ్రహాలను బెల్జియంలో ప్రదర్శించగా ఖ్యాతి గడించాయి.

### మంత్రముగ్ధులను చేసే విగ్రహాలు..

శిల్పాచార్యులు స్థానికంగా లభించే నల్లరాతి శిలతో అందంగా నటరాజ విగ్రహాన్ని చెక్కారు. ఈ విగ్రహంలో కనిపించే శరీర సౌష్టవాలు నాట్యభంగిమలు నాట్యకళాకారులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. అదే విధంగా 7-8 శతాబ్దాలకు చెందిన సూర్య విగ్రహం కూడా మెత్తటి ఎర్రఇసుక, రాతిని ఉపయోగించి తయారు చేశారు. 'సప్తాస్వ రథసమారూఢం'అన్నట్టుగా ఏడు గుర్రాలతో ఒకే చక్రం కలిగిన రథం, ఉషా, ఛాయా సమేతంగా సూర్య విగ్రహాన్ని అందంగా మలిచి ఉన్న ఈ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. ఇక 6-7 శతాబ్దాలకు చెందిన నాగబంధ విగ్రహాన్ని పరిశీలిస్తే.. పద్మ బంధంలో ఏడు తలలు కలిగి మానవ ఆకృతిని పోలి ఉన్న నాగబంధ విగ్రహం కళాకారులను మనసు దోచుకుంటుంది. 7-8 శతాబ్దాలకు చెందిన మహిషాసురమర్ధిని విగ్రహం కూడా అలనాటి దేవీభాగవతాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపిస్తుంది. అసుర సంహారం కోసం మహిషాసురిడిని సంహరించి మహిషి తలపై తాండవం చేస్తున్నట్టు ఆదిపరాశక్తి అభయముద్రలో దర్శనమిస్తుంది. అలాగే అలనాటి వైభవాన్ని చాటి చెప్పే స్తంభాలను నేటి తరాలవారిని అదరహో అనిపిస్తాయి. ఈ స్తంభంపై మలచబడిన శిల్పా ఆకృతులను పరిశీలిస్తే పట్టుచీరలపై ఉన్న బార్డర్ల డిజైన్‌లు తలపిస్తున్నాయి.

### నంది వాహనంపై శివపార్వతులు..



పరమశివుడి రూపం ఎక్కడ చూసినా లింగరూపంలోనే దర్శనమిస్తుంది. సతీ సమేతుడై ఉన్న పార్వతీ పరమేశ్వరుడు నంది వాహనంపై ఆశీనులై దర్శనమివ్వడం అనేది చాలా అరుదు. కానీ అలంపూర్‌లో మాత్రం దేవతా స్వరూపంలో, అది కూడా శివుడు పార్వతీ సమేతుడై నంది వాహనంపై కూర్చుని ఉండటం ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. అలాంటి విగ్రహం చూడాలంటే అలంపూర్ మ్యూజియానికి రావాల్సిందే.

### శిలాశాసనం ద్వారా తెలిసేదేమిటంటే..

ఆలయాల మనుగడ కోసం ఆనాటి రాజులు ఎన్నో భూములను మాణ్యాలుగా సమర్పించారు. సూర్య, చంద్రులు ఉన్నంత వరకు ఈ మాణ్యాలు ఆలయాలకు చెందాల్సిందేనని.. అలాంటి మాణ్యాలను ఎవరైనా హస్తగతం చేసుకుంటే గోవధ చేసినంత పాపం వస్తుందని తెలియజేస్తూ ఆ శాసనంపై సూర్య, చంద్రులు, లింగం, ఆవు, ఖడ్గం వంటి బొమ్మలతో శిలాశాసనం చేశారు. అది హలగన్నడ లిపిలో కనిపిస్తుంది.

# మొత్తం జనాభాలో 76 శాతం మందికి ఉష్ణోగ్రతల ముప్పు

**ఉరుముతున్న ఉష్ణోగ్రతలు**

**దేశంలో అధికం నుంచి అత్యధిక హీట్ రిస్క్ కేటగిరీలో 57 శాతం జిల్లాలు**

**'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' అధ్యయనంలో వెల్లడి**




శిలాజ ఇంధనాల వాడకం నానాటికీ పెరిగిపోతుండడం, తద్వారా వాతావరణ మార్పులు సంభవిస్తుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. భారత్ సైతం ఇందుకు మినహాయింపు కాదు. దేశంలో 57 శాతం జిల్లాలు అధికం నుంచి అత్యధిక హీట్ రిస్క్ కేటగిరీలో ఉన్నట్లు ఢిల్లీకి చెందిన వాతావరణ సంస్థ కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్(సీఈఈడబ్ల్యూ) వెల్లడించింది. దేశంలోని మొత్తం జనాభాలో ఏకంగా 76 శాతం మంది ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతల ముప్పును ఎదుర్కొంటున్నట్లు తేల్చిచెప్పింది. ఈ మేరకు మంగళవారం ఒక నివేదిక విడుదల చేసింది. ఢిల్లీ, మహారాష్ట్ర, గోవా, కేరళ, గుజరాత్, రాజస్తాన్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సహా పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో హీట్ రిస్క్ అత్యధికంగా ఉన్నట్లు తెలియజేసింది. గత పదేళ్లలో అత్యధిక వేడి కలిగిన పగటి దినాల కంటే అత్యధిక వేడి కలిగిన రాత్రి దినాల సంఖ్య వేగంగా పెరిగినట్లు వివరించింది. అధ్యయనంలో భాగంగా సీఈఈడబ్ల్యూ సంస్థ 734 జిల్లాలకు సంబంధించిన హీట్ రిస్క్ ఇండెక్స్(హెచ్ఆర్ఐ)ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం 1982 నుంచి 2022 వరకు.. 40 ఏళ్ల వాతావరణ గణాంకాలు, ఉపగ్రహ చిత్రాలు ఉపయోగించుకుంది. ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులు, జల వనరులు, భూవినియోగం, పచ్చదనం తదితర అంశాలను అధ్యయనం చేసింది. జనాభా, భవనాలు, ఆరోగ్య, సామాజిక-ఆర్థిక అంశాలు, పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు, వాతావరణంలో తేమ వంటి అంశాలను సైతం పరిగణనలోకి తీసుకుంది. 734 జిల్లాలకు గాను 417 జిల్లాలు హై నుంచి వెరీ హై రిస్క్ కేటగిరీల్లో ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ఇందులో 151 జిల్లా హై రిస్క్, 266 జిల్లాలు వెరీ హై రిస్క్ విభాగంలో ఉన్నాయి. 201 జిల్లాలు సాధారణ, 166 జిల్లాలు తక్కువ లేదా అతి తక్కువ హీట్ రిస్క్ విభాగాల్లో నిలిచాయి. ఉష్ణోగ్రతలు సాధారణం లేదా తక్కువగా ఉన్నట్లయితే దాని అర్థం వేడి వల్ల ముప్పు లేనట్లు కాదని, సీఈఈడబ్ల్యూ స్పష్టంచేసింది. ఇతర జిల్లాల కంటే కొంత తక్కువగా ఉన్నట్లు మాత్రమే భావించాలని పేర్కొంది. దేశంలో అధిక ఉష్ణోగ్రత కలిగిన రోజులు పెరుగుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన రోజులు అంతకంటే ఎక్కువగా పెరుగుతుండడం గమనార్హం. అంటే మనుషులకు ముప్పు సైతం అదే స్థాయిలో పెరుగుతున్నట్లే లెక్క. ఉష్ణోగ్రతలు అత్యధికంగా మనుషులు తట్టుకోలేరు. అది ప్రమాదకరమే. శారీరకంగా, మానసికంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పల్లెలతో పోలిస్తే పట్టణాలు, నగరాల్లో అధిక ఉష్ణోగ్రత కలిగిన రాత్రి దినాలు అధికంగా నమోదవుతున్నాయి. అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్టే ఇందుకు కారణం. 10 లక్షలకుపైగా జనాభా ఉన్న జిల్లాలతోపాటు ముంబయి, బెంగళూరు, భోపాల్, జైపూర్, ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లో అధిక ఉష్ణోగ్రత కలిగిన రాత్రి దినాల సంఖ్య భారీగా పెరిగింది. చల్లగా ఉండే హిమాలయా ప్రాంతాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన పగటి, రాత్రి రోజుల సంఖ్య పెరుగుతోంది. సున్నితంగా ఉండే పర్వత ప్రాంత భౌగోళిక స్థితిగతులను ఈ పరిణామం తీవ్రంగా ప్రభావితం చేయనుంది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లో అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన పగటి, రాత్రి రోజుల సంఖ్య 15 చొప్పున పెరిగింది. ఈ ప్రతి ఏటా వేసవిలో ఈ పెరుగుదల కనిపిస్తోంది. ఉత్తర భారతదేశంలో వేసవి తేమ గత పదేళ్లలో 30-40 శాతం నుంచి 40-50 శాతం పెరిగింది. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా 2030 నాటికి 3.5 కోట్ల ఉద్యోగాలను కోల్పోతామని, జీడీపీలో 4.5 శాత తగ్గుదల నమోదవుతుందని సీఈఈడబ్ల్యూ అధ్యయనం అంచనా వేసింది. ఇండియాలో 2024లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా 45,000కుపైగా గుండెపోటు కేసులు నమోదయ్యాయి. 159 మరణాలు సంభవించాయి. ఇవన్నీ అధికారికంగా నమోదైన గణాంకాలే. నమోదు కానివి ఇంకెన్నో

# బొప్పాయి.. లాభమేనోయి..

**ఎకరాకు 30 టన్నుల దిగుబడి**

**టన్ను కాయలకు రూ.5 వేల రాబడి**

**సాగుకు రైతుల మొగ్గు**



దేవరపల్లి: పొగాకు, జీడిమామిడి పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో ప్రత్యామ్నాయంగా పండ్ల తోటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బొప్పాయి సాగుతో లాభాలు సాధిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని 326 హెక్టార్లలో రైతులు బొప్పాయి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కడియం, అనపర్తి, దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు మండలాల్లో దీని సాగు అధికంగా ఉంది. తెగుళ్లను తట్టుకునే రకాల మొక్కలను మహారాష్ట్ర నుంచి తీసుకుని వచ్చి, తోటలు వేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. బొప్పాయిలో అనేక రకాల వంగడాలున్నప్పటికీ ఎక్కువ మంది పింక్, కో-786, తైవాన్ రెడ్ లీడ్, స్వీట్ బరీ రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మొక్క వేసిన 9 నెలల్లో కాపు వస్తోంది. రెండు నుంచి నాలుగేళ్ల పాటు ఎకరాకు 30 నుంచి 40 టన్నుల చొప్పున దిగుబడి వస్తోంది. దిగుబడి బాగుంటే నాలుగేళ్ల వరకూ తోటలు ఉంటాయి. కొంత మంది రెండేళ్లకే తోటలను తొలగిస్తున్నారు. మొదటి రెండేళ్లు దిగుబడి, పండు నాణ్యత, సైజు బాగుంటాయి. ఒక్కో పండు 2 నుంచి 4 కిలోల బరువు ఉంటుంది. ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోందని, పెట్టుబడి రూ.60 వేల నుంచి రూ.70 వేలు అవుతోందని చెబుతున్నారు.

### ఆరోగ్య ప్రయోజనాలు

బొప్పాయి పండుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తుంది. చర్మం, కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బరువు తగ్గడానికి, గుండె సంబంధిత సమస్యల నివారణకు తోడ్పడుతుంది. బొప్పాయిలో సమృద్ధిగా లభించే విటమిన్-సి దంతాల చిగుళ్ల ఆరోగ్యానికి, రక్తవృద్ధికి, రోగ నిరోధక శక్తి పెంపుదలకు తోడ్పడుతుంది. విటమిన్-బి నోటిపూత, తెల్లమచ్చలు, పెదాల పగుళ్లు రాకుండా కాపాడుతుంది. కెరోటిన్, ఎ, బి, సి, ఇ విటమిన్లు, ఖనిజాలు, ఫ్లేవొనాయిడ్‌లు, ఫోలేట్‌లు, పాంథోనిక్ ఆమ్లాల వంటి పోషకాలు బొప్పాయి పండులో పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇన్ని విధాల ఆరోగ్యం కలిగించేది కావడంతో బొప్పాయి పండును ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

### దిగుబడి బాగుంది

నేను నాలుగెకరాల్లో బొప్పాయి పంట వేశాను. రెండు కోతలు జరిగాయి. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను కాయలకు రూ.10 వేలు లభించాయి. ప్రస్తుతం టన్ను కాయలు రూ.5 వేలు పలుకుతున్నాయి. రావులపాలెం, అమలాపురం ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కాయలు కొనుగోలు చేసి, కోల్‌కతా, భువనేశ్వర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ధర బాగుంటే మంచి ఆదాయం వస్తుంది. జూలైలో తోట వేయగా, ఫిబ్రవరిలో కాపునకు వచ్చింది. మహారాష్ట్ర నుంచి మొక్క రూ.23 చొప్పున కొనుగోలు చేసి తెచ్చాను. ఎకరాకు 700 మొక్కలు పడతాయి. కాయ సైజు, నాణ్యత బాగున్నాయి.

### కొవ్వూరు డివిజన్‌లో అధికం

బొప్పాయి సాగు కొవ్వూరు డివిజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని కడియం, అనపర్తి ప్రాంతాల్లో అక్కడక్కడ తోటలు వేశారు. వాతావరణం అనుకూలించి, తెగుళ్లు లేకుండా ఉంటే రైతులకు ఇది లాభదాయకమైన పంట. రైతులు ఇప్పుడిప్పుడే బొప్పాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

### కోల్‌కతా, ఒడిశాకు ఎగుమతి

వేసవి అనంతరం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు బొప్పాయి తోటలు వేస్తారు. నల్ల నేలలు, ఇసుక, రాతి నేలలు దీని సాగుకు అనుకూలంగా ఉంటాయి. రాతి నేలలు, కొండ ప్రాంతాల్లో ఈ పంట పండదు. ఏటా మార్చి నుంచి జూన్ వరకూ దిగుబడి వస్తుంది. ఈ ప్రాంతంలో పండించిన బొప్పాయి కాయలు, పండ్లను ఒడిశా, భువనేశ్వర్, కోల్‌కతా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒడిశాలోని పలు ప్రాంతాల్లో బొప్పాయి కాయలు కూరగా వండుకొని తింటూంటారు. దీంతో, ఆ ప్రాంతాలకు పచ్చి కాయలు కూడా ఎగుమతి చేస్తున్నారు. వేసవిలో పండ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. స్థానికంగా ఉన్న పండ్ల వ్యాపారులు తోటల్లోకి వచ్చి పండు కాయలు కొనుగోలు చేస్తారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో కిలో రూ.10 పలికింది. ప్రస్తుతం రూ.5 పలుకుతోంది.